భృంగి వాహనంపై ఆది దంపతుల విహారం



కర్నూలులో జీబీఎస్..!

● వైరస్ లక్షణాలతో చేరిన మహిళ ● అందుబాటులో ఇమ్యూనోగ్లోబిన్ ఇంజెక్షన్లు ● అప్రమత్తమైన కర్నూలు వైద్యులు



కర్నూలు హస్పిటల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వాసులను కొత్త వైరస్ వణికిస్తోంది. మొన్నటి వరకు మహారాష్ట్ర, తెలంగాణల్లో కలకలం రేపిన గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) ప్రస్తుతం రాష్ట్రంలో కూడా చాపకింద నీరులా వ్యాపించింది. జీబీఎస్ లక్షణాలతో 44 ఏళ్ల మహిళ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ఆరు రోజుల క్రితం తీవ్ర జ్వరం, కాళ్ల నొప్పులతో బాధపడుతూ ఫీమేల్ మెడికల్ వార్డులో ఆమె అడ్మిట్ అయింది. రోగికి పరీక్షలు నిర్వహించగా.. జీబీఎస్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ కావడంతో మహిళను ఏఎంసీ వార్డులో ఉంచి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ కేసుతో కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అప్రమత్తమయ్యారు. గురువారం సూపరింటెండెంట్ చాంబరులో జీబీఎస్ వ్యాధి నివారణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధి కలుషిత ఆహారం వల్ల సోకుతుందని, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. జీజీహెచ్‌లో చికిత్సకు అవసరమైన ఇమ్యూనోగ్లోబిన్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. గులియన్‌బారే సిండ్రోమ్‌కు నోడల్ ఆఫీసర్‌గా మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డమం శ్రీనివాసులును నియమించారు. ఈ సమావేశంలో సీఎస్ఆర్ఎంవో బి.వెంకటేశ్వర్లు, న్యూరాలజి హెచ్‌ఓడీ సి.శ్రీనివాసులు, మెడిసిన్ హెచ్‌ఓడీ ఇక్బాల్ హుసేన్, పీడియాట్రిక్ అసోసియేట్ ప్రొఫెసర్ రవీంద్రనాథ్ రెడ్డి, అడ్మినిస్ట్రేటర్లు శివబాల, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.


జీబీఎస్ లక్షణాలు

గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) వ్యాధి. ఇది ఒక అరుదైన నరాల వ్యాధి. దీన్ని ఆటో ఇమ్యూన్ వ్యాధి అని కూడా అంటారు. శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థ, నరాలపై ఈ వైరస్ దాడి చేస్తుంది. ఫలితంగా కండరాల బలహీనత, గొంతునొప్పి, నడవలేని స్థితి, అలిసిపోయినట్లుగా అనిపిస్తుంది. మొదటి దశలో చికాకు, నడుమునొప్పి ఉంటుంది. పెరాల్సిస్ మాదిరి పాదాలు, చేతులు, ముఖం నిశ్చేష్టంగా ఉంటుంది. చర్మంలో సూదిగుచ్చినట్లుగా అనిపిస్తుంది. కొన్ని కేసుల్లో కండరాలు పూర్తిగా పని చేయకపోవడం గుండె వేగం మారడం, ఊపిరితిత్తుల సమస్యలు సంభవిస్తాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఎదురై వెంటిలేటర్ అవసరం అవుతుంది. ముఖం, కంటి కండరాలపై ప్రభావం కొన్ని సందర్భాల్లో ముఖ నరాలు ప్రభావితమవుతాయి.

ఎదుర్కొనేందుకు సిద్ధం

ఎలాంటి విపత్కర పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. జీబీఎస్ వ్యాధి నివారణ కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. ఇమ్యూనోగ్లోబిన్ ఇంజెక్షన్లు మందులు అందుబాటులో ఉంచాము. ప్రత్యేకంగా వైద్యులతో నోడల్ కమిటీని ఏర్పాటు చేశాం. ఇది అంటువ్యాధి కాదు. ప్రజలు ఈ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి. వ్యాధి లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకూడదు.

- డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, కర్నూలు జీజీహెచ్





భృంగిపై శ్రీశైలేశుడు





పట్టువస్త్రాలకు స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు

● బ్రహ్మోత్సవాలతో పరవశించిన శ్రీగిరి
● ద్వారకా తిరుమల నుంచి పట్టువస్త్రాలు
● వేలాదిగా తరలివచ్చిన భక్తులు

శ్రీశైలం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైలం మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా రెండోరోజు గురువారం అర్ధనారీశ్వర రూపానికి మూలకారకుడైన భృంగి భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివార్ల సేవలో తరించారు. భృంగి వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆసీనులనుజేసి సుగంధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను క్షేత్ర పురవీధుల్లో విహరింపజేశారు. అశేష భక్తజనం ఈ అద్భుత ఘట్టాన్ని కనులారా వీక్షించి పరవశించారు. గ్రామోత్సవం ముంగిట కోలాటం, చెక్కభజన, గొరవయ్యల, బుట్టబొమ్మల నృత్యాలు, బీరప్పడోలు, బంజార నృత్యం, తప్పెట్లు, శంఖునాదాలు, మంగళవాయిద్యాలతో కొనసాగింది. ఆలయ రాజగోపురం నుంచి గంగాధర మంటపం మీదుగా బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు గ్రామోత్సవం కొనసాగింది. వేలాదిగా తరలివస్తున్న భక్తులతో శ్రీగిరి కిక్కిరిసింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ముమ్మర చర్యలు చేపట్టారు.

మిగతా 6వ పేజీలో



గ్రామోత్సవం ఎదుట కోలాటాల ప్రదర్శన



కేరళ కళాకారుల సంప్రదాయ నృత్యం



డోలు వాయిద్య కళాకారుల ప్రదర్శన



అసంపూర్తిగా డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ

ఉర్దూ ఆశలు...!

దేశంలోనే ఏకైక ఉర్దూ విశ్వవిద్యాలయం 'మౌలానా అజాద్ జాతీయ ఉర్దూ యూనివర్సిటీ' హైదరాబాద్‌లో ఉంది. రాష్ట్ర విభజన తరువాత ఉర్దూ విద్యను అభ్యసించేందుకు ముస్లిం విద్యార్థులు హైదరాబాద్ వెళ్లే పరిస్థితి రాకూడదని 2019కి మునుపు టీడీపీ ప్రభుత్వం కర్నూలులో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటిని ఏర్పాటు చేశారు. ఓర్వకల్లు వద్ద 144 ఎకరాల్లో శాశ్వత భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. పిల్లర్లు, శ్లాబుల వరకు నిర్మాణాలు జరిగాయి. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం ఉర్దూ వర్సిటీకి శాపంగా మారింది. నిర్మాణాలు అసంపూర్తిగా ఆగిపోయాయి. జగన్ ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఓ మంత్రి ఈ భూములు కొట్టేయాలనే ఎత్తుగడలో భాగంగానే పనులు ఆపేశారనే ఆరోపణలు కూడా వచ్చాయి. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో ఉర్దూ ఉన్నత విద్యను అభ్యాసించే విద్యార్థుల్లో ఆశలు చిగురించాయి. నిర్మాణాల్లో వేగం పుంజుకుంటుందని ఆశిస్తున్నారు. అది జరగాలంటే 2025-26 బడ్జెట్‌లో కనీసం రూ.31.26 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపారు. కర్నూలు, నంద్యాల జిల్లా మైనార్టీ విద్యార్థుల ఉజ్వల భవితను తీర్చిదిద్దే ఉర్దూ వర్సిటీకి మంచి రోజులు వచ్చేనా..? మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దృష్టి సారిస్తారా..? ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

● ఉర్దూ వర్సిటీకి మంచి రోజులు వచ్చేనా?
● 145 ఎకరాల్లో శాశ్వత భవనాలకు శ్రీకారం
● వైసీపీ హయాంలో నిండా నిర్లక్ష్యం
● జగన్ ప్రభుత్వంలో అటకెక్కిన నిర్మాణాలు
● మళ్లీ చంద్రబాబు ప్రభుత్వంతో ఆశలు
● 2025-26 బడ్జెట్‌లో రూ.31.26 కోట్లు నిధులు కేటాయించాలి

కర్నూలు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన తర్వాత ముస్లింలు ఉర్దూ ఉన్నత విద్యాభ్యాసం కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేకుండాపోయింది. నవ్యాంధ్రలో అత్యధిక ముస్లిం జనాభా కలిగిన కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఉర్దూ విశ్వావిద్యాలయం ఏర్పాటు చేయాలని చంద్రబాబు సంకల్పించారు. రాష్ట్ర విభజన జరిగిన రెండేళ్లకే 2016లో ఏపీ స్టేట్ లెజిస్లేచర్ యాక్ట్-2016 ప్రకారం కర్నూలు నగరంలో 'డాక్టరు అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. స్థానిక ఉస్మానియా కళాశాలలో 2017-18 విద్యా సంవత్సరం నుంచి తాత్కాలిక భవనంలో తరగతులు ప్రారంభించారు. ప్రస్తుతం వర్సిటీ తరగతులు, పరిపాలన మొత్తం ఓ ప్రైవేటు భవనంలో కొనసాగుతోంది. వర్సిటీ ప్రారంభంలో ఉర్దూ, ఇంగ్లీష్, ఎకనామిక్స్, కంప్యూటర్స్, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ విభాగాలు, 150 మంది విద్యార్థులతో ప్రారంభించారు. ఆరేళ్లలో వర్సిటీ ఎంతో అభివృద్ధి చెందింది. తర్వాత 4 పీజీ గ్రూపులు సహా అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులు ప్రారంభమయ్యాయి. కర్నూలు, నంద్యాల, చిత్తూరు, కడప, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాల నుంచి 550 మందికి పైగా విద్యార్థులు వివిధ కోర్సులలో పీజీ, డిగ్రీ చదువుతున్నారు. ప్రైవేటు భవనంలో అరకొర సౌకర్యాలతో ఉర్దూ విద్యాభ్యాసం చేస్తున్న వారు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. 'అయ్యా..! మా వర్సిటీ కష్టాలు తీర్చండి' అంటూ గత ప్రభుత్వ పాలకులను అడిగితే పట్టించుకోలేదు. అధునాత సౌకర్యాలు, ల్యాబ్‌లు, బాలుర, బాలికలకు ప్రత్యేక హాస్టళ్లు, తాగునీరు, రవాణా.. వంటి సౌకర్యం కల్పిస్తే.. ఢిల్లీ, నోయిడా, హరియాన్, ఉత్తరప్రదేశ్.. వంటి ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థులు కూడా వర్సిటీలో చదువుకోవడానికి ఆసక్తి చూపుతారు. ఆ దిశగా ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించి ప్రోత్సాహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అసంపూర్తి భవనాలు మధ్య పెరుగుతున్న పిచ్చి మొక్కలు

మిగతా 7వ పేజీలో

సకాలంలో పీ-4 సర్వే పూర్తి చేస్తాం

కలెక్టర్ రాజకుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సకాలంలో పీ-4సర్వే పూర్తి చేస్తామని వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ విజయానంద్‌కు కలెక్టర్ రాజకుమారి విన్నవించారు. గురువారం ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఏపీపీఎస్సీ గ్రూప్-2, ఇంటర్మీడియట్ పరీక్షలు, పీ-4 సర్వే (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్, పార్టనర్‌షిప్), ఎంఎస్ఎంఈ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో పీ-4సర్వే ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. మార్చి 2వ తేదీలోపు సర్వే పూర్తి చేసి వివరాలను అందజేస్తామని తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని, ప్రశాంతంగా పరీక్షలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జవహర్‌బాబు, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, భూగర్భ జలశాఖ డీడీ రఘురామ్ పాల్గొన్నారు.

బీఈడీ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరిగిన బీఈడీ మొదటి సెమిస్టర్ ఫలితాలను కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. ఉపకులపతి డాక్టర్ వి.వెంకట బసవరావు ఆదేశాల మేరకు ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచామని తెలిపారు. 3,310 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా 3,115 మంది హాజరయ్యారని తెలిపారు.

రైతుకు నష్టం జరిగితే.. బాధ్యత మీదే

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఏమాత్రం నష్టం జరిగినా బాధ్యత అధికారులదేనని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు హెచ్చరించారు. గురువారం కర్నూలు మార్కెట్ యార్డులోని ఏడీఎం కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లాలోని మార్కెట్ కమిటీల సెక్రటరీలతో జేడీ రామాంజనేయులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెస్సు వసూళ్ల ప్రభుత్వ లక్ష్యం మేరకు మార్చి చివరి కల్లా సాధించాలన్నారు. మహాచెక్ పేరుతో అమలు చేస్తున్న కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో వినియోగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కర్నూలు, నంద్యాల ఏడీఎంలు నారాయణమూర్తి, రెహమాన్, సెక్రటరీలు జయలక్ష్మి, సుందర్‌రాజు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank

నంద్యాల-II బ్రాంచ్ (13374)
శ్రీనివాసనగర్, నంద్యాల, కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్-518501 ✆ 9440905409

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

కు:
1. శ్రీ బండి వనజ, తండ్రి: బి. సుబ్బరాయుడు, హెచ్‌నెం.296/613, రాయల్ కాంపౌండ్, నంద్యాల 518502 (ఋణగ్రహీత).
2. శ్రీ యస్. అమృత రాజు, తండ్రి: ఆంద్రూస్, హెచ్‌నెం.30-112, రెవెన్యూ క్వార్టర్స్, నంద్యాల 518502 (హామీదారు).

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ నోటీసు (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును).

కెనరా బ్యాంక్, నంద్యాల-II బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సదరు సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13 (8) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది.

లోను అకౌంట్ ఋణగ్రహీత: **శ్రీ బండి వనజ,** తండ్రి: బి. సుబ్బరాయుడు, **హామీదారు: శ్రీ యస్. అమృత రాజు,** తండ్రి: ఆంద్రూస్ వారి లోన్ అకౌంట్‌కు సంబంధించి బకాయి **రూ. 7,38,332.80 (అక్షరాల ఏడు లక్షల ముప్పై ఎనిమిది వేల మూడు వందల ముప్పై రెండు రూపాయలు మరియు ఎనభై పైసలు మాత్రమే)** మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ కెనరా బ్యాంక్, అధీకృత అధికారి సదరు చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద **26-11-2014 తేదిన డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఋణగ్రహీత/సంస్థ, తనఖాదారు మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) విఫలమైనందున **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **తేది. 25-11-2015**న మీ సెక్యూర్డ్ ఆస్తులను సదరు చట్టం సంబంధి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక స్వాధీనం తీసుకున్నారు మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును **సాక్షి** (తెలుగు) & ది హన్స్ ఇండియా (ఇంగ్లీష్) వార్తాపత్రికలలో తేది.26.11.2015 న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. **12-02-2025** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ. 14,30,684.39 (అక్షరాల పద్నాలుగు లక్షల ముప్పై వేల ఆరు వందల ఎనభై నాలుగు రూపాయలు మరియు ముప్పై తొమ్మిది పైసలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు సర్ఫేసీ చట్టం, 2002 సంబంధి రూల్ 8(6) క్రింద ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది. (ఎ) అటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా (సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటి. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు. చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తేది: 13.02.2025, ప్రదేశం: నంద్యాల సం/- **అధీకృత అధికారి, కెనరా బ్యాంక్**

నల్లమల గిరులు.. ఓంకార ధ్వనులు


నాగలూటి మెట్లను ఎక్కుతూ మల్లన్న సన్నిధికి చేరుకుంటున్న భక్తులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైల క్షేత్రంలో జరుగుతున్న మహాశివరాత్రి బహ్మోత్సవాలను పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి భక్తులు కాలినడకన శ్రీశైలానికి తరలివెళ్లడంతో నల్లమల గిరులన్నీ శివనామ స్మరణతో ప్రతిధ్వనిస్తున్నాయి. ఎండలను సైతం లెక్కచేయకుండా పిల్లాపాపలను వెంటపెట్టుకుని శివశివ.. హరహర అంటూ దుర్భేధ్యమైన కొండల్లో శ్రీశైలానికి పాదయాత్ర సాగిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, నందికొట్కూరు, డోన్, కర్నూలు తదితర ప్రాంతాల నుంచే కాకుండా అనంతపురం, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి పాదయాత్రికులు పెద్దసంఖ్యలో శ్రీశైల క్షేత్రానికి తరలివెళ్తున్నారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు, శివస్వాములు ప్రైవేటు వాహనాలు, ఆర్టీసీ బస్సుల ద్వారా ఆత్మకూరు మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చేరుకుని అక్కడి నుంచి శ్రీశైలానికి పాదయాత్ర సాగిస్తున్నారు. మరికొంత మంది వారి స్వగ్రామాల నుంచే పాదయాత్రగా తరలివస్తున్నారు.



- మల్లన్న స్మరణలతో కొండకోనలు దాటుకుంటూ..
- మరచిపోలేని మజిలీ.. శ్రీశైలం పాదయాత్ర
- పిల్లాపాపలతో మల్లన్న చెంతకు చేరుతున్న పాదయాత్రికులు
- సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న కాలినడక భక్తులు

మరచిపోలేని మజిలీ.. శ్రీశైలం పాదయాత్ర


భూలోక కైలాసంగా విరాజిల్లుతున్న శ్రీశైల క్షేత్రానికి పాదయాత్రగా తరలివెళ్లడం జీవితంలోనే మరచిపోలేని మజిలీగా చెప్పవచ్చు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో శ్రీశైలానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన భక్తులు పాదయాత్రగా తరలివస్తున్నారు. కొందరు ఏకంగా తమ స్వగ్రామాల నుంచే నేరుగా శ్రీశైలానికి కాలినడకన వెళ్తుండగా మరికొంత మంది భక్తులు ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామానికి వాహనాల్లో చేరుకుని అక్కడి నుంచి పంటపొలాల గుండా నాగలూటి చెంచుగూడేన్ని చేరుకుని ఆ తర్వాత 5 కిలోమీటర్ల అటవీ మార్గంలో ప్రయాణించి నాగలూటి వీరభద్రాలయానికి సందర్శించి అక్కడి నాగలూటి తిప్పలు, దామర్ల కుంట, నల్లమల కొండలపై అడవిమార్గం గుండా సుమారు 14 కిలోమీటర్లు భక్తులు ప్రయాణించి పెచ్చెర్వు చెంచుగూడేన్ని చేరుకుంటున్నారు. అక్కడి నుంచి కత్తుల కొండ, కోర్కెలకొండ అటవీ ప్రాంతంలో 15 కిలోమీటర్లు ప్రయాణిస్తే.. భీముని కొలను ప్రాంతానికి చేరుకుంటున్నారు. అక్కడి నుంచి ప్రమాదకర జారుడు కొండపై ప్రయాణించి కైలాస ద్వారానికి చేరుతున్నారు. 6 కిలోమీటర్లు దూరం ప్రయాణించి శ్రీశైల మల్లన్న దర్శనానికి తరలివెళ్తున్నారు. ఇదిలావుంటే పాదయాత్రలో భాగంగా నాగలూటి మెట్లు, అడవి అందాలు, మార్గమధ్యలో ప్రాచీన కట్టడాలు, పెచ్చెర్వులో ఆదిమ చెంచుల జీవన విధానాలు భక్తులకు కనువిందు చేస్తున్నాయి.

దారిపొడవునా ఆచారాలు

శ్రీశైలానికి కాలినడకన తరలివెళ్తే పాదయాత్రికులు దారిపొడవునా ఆచారాలు పాటిస్తూ తమ యాత్రను కొనసాగిస్తున్నారు. వెంకటాపురం నుంచి పాదయాత్ర కొనసాగించే భక్తులు తొలుత గోసాయికట్ట ఆంజనేయస్వామిని దర్శించుకుంటారు. ఆ తర్వాత నాగలూటి వీరభద్రస్వామిని దర్శించుకుని మెట్ల మార్గం గుండా బయలుదేరుతారు. అక్కడి నుంచి దామర్లకుంట మీదుగా పెచ్చెర్వుకు చేరుకుని అటునుంచి వెళ్లే క్రమంలో కోర్కెలకొండలో సంతానం కోసం చెట్లకు ఊయలు కట్టడం, సొంతింటి కలలు నెరవేరాలని ఆకాంక్షిస్తూ ఒకదానిపైఒకటి రాళ్లను అమర్చి కోర్కెలు కోరుకోవడం జరుగుతోంది. అక్కడి నుంచి సీతమ్మబావిని సందర్శించి ఆ తర్వాత భీముని కొలనుకు చేరుకుని అక్కడ భీముడి విగ్రహాన్ని దర్శించుకుంటారు. ఆ తర్వాత కైలాస ద్వారాన్ని చేరుకున్న అనంతరం హఠకేశ్వరాలయాన్ని, సాక్షిగణపతిని దర్శించుకుని మల్లన్న సన్నిధికి చేరుకుంటారు.


ప్రాచీన కట్టడం వద్ద పాదయాత్రికులు


భీముని కొలను వద్ద పాదయాత్ర


కోర్కెలకొండలో కొనసాగుతున్న ఆచారాలు

నల్లమల అందాల నడుమ మల్లేశ్వరుడు

- గుహల్లో వెలసిన దేవతామూర్తులు
- శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి విగ్రహాలు
- శివరాత్రికి ముస్తాబైన భైరవ, మలయచల క్షేత్రాలు


మలయచల వద్ద గుహలో మల్లేశ్వరుడు

చాగలమర్రి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నల్లమల ప్రకృతి సోయగాల నడుమ వెలసిన భైరవ, మలయచల ఆలయాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి భైరవేశ్వర, మలయచల మల్లేశ్వర ఆలయాలు ఉన్నాయి. రాచరికపు గుర్తులు ఉన్న అతి పురాతన ఆలయాలు ఇవి. వీటి సమీపంలో తెలుగుగంగ జలాశయం పర్యాటకులను ఆకర్షిస్తోంది. మండలంలోని చింతలచెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో మూడు కిలోమీటర్ల దూరంలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో భైరవేశ్వర ఆలయాన్ని నిర్మించారు. నల్లమల కొండల మధ్య మలయచల మల్లేశ్వరుడు గుహల్లో వెలిశాడు. ఇక్కడ ఈశ్వరుడు, వేణుగోపాలస్వామి, వీరభద్రస్వామి, పార్వతిదేవి, ఈతర దేవతా విగ్రహాలు కొలువుదీరి ఉన్నాయి. ముఖ్యంగా ఉమామహేశ్వర విగ్రహాలు ఉండటం ఇక్కడి ప్రత్యేకత. 500 సంవత్సరాల క్రితం మల్లేశ్వరుడు కొలువుదీరినట్లు క్షేత్ర చరిత్రను బట్టి తెలుస్తోంది. ఈ ప్రాంతంలో 5 పెద్ద గుహలు ఉన్నాయి. ఈ గుహల్లోకి ఎవరూ వెళ్లే సాహసం చేయలేదు. ఆ గుహల్లో నిధులు ఉన్నట్లు వదంతులు ఉన్నాయి. నల్లమల సోయగాల నడుమ తెలుగుగంగ కాలువ, మినీ రిజర్వాయర్ ఉండటం ఈ ప్రాంతానికి ఎంతో శోభనిస్తోంది. ఈ నెల 26న శివరాత్రి ఉత్సవాలకు ఈ క్షేత్రాలను ముస్తాబు చేశారు.

మలయచలకు వెళ్లాలంటే..

మలయచల ప్రాంతానికి వెళ్లాలంటే చాగలమర్రి నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న కదిరిపురం తండాకు వెళ్లాలి. అక్కడి నుంచి నల్లమల అటవీ ప్రాంతంలో 3 కిలోమీటర్లు నడిచి వెళ్తే అక్కడికి చేరుకోవచ్చు. చాగలమర్రి నుంచి చింతలచెరువు గ్రామానికి వెళ్లి అక్కడి నుంచి భైరవేశ్వర ఆలయం మీదుగా తెలుగుగంగ ప్రధాన కాలువపై నుంచి వెళ్తే మలయచల క్షేత్రానికి చేరుకోవచ్చు.

ఏడాదికోసారే శివయ్య దర్శనం!

- అభయారణ్యంలో గుండ్ల బ్రహ్మేశ్వరుడు
- దట్టమైన అడవిలో అద్భుతమైన ఆలయం

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా పరమేశ్వరుడికి నిత్యపూజలు, జలాభిషేకాలు, తదితర పూజా కైంకర్యాలు నిర్వహిస్తుంటారు. కానీ నల్లమల అటవీ క్షేత్రంలోని ఓ ఆలయంలో మాత్రం శివయ్య ఏడాది ఒక్కసారే దర్శనమిస్తారు. అభయారణ్యం నడుమ ఉన్న ఆ క్షేత్రమే గుండ్ల బ్రహ్మేశ్వరం. ఇక్కడ కొలువైన గుండ్ల బ్రహ్మేశ్వరుడిని దర్శించుకోవాలంటే ప్రతి ఏటా వచ్చే శివరాత్రి రోజు మాత్రమే వెళ్లాల్సి ఉంటుంది. బండిఆత్మకూరు మండల పరిధిలోని దట్టమైన నల్లమల నట్టడవిలో గుండ్ల బ్రహ్మేశ్వర క్షేత్రం ఉంది. ఈ క్షేత్రంలో వెలసిన బ్రహ్మేశ్వరుడు, రాజరాజేశ్వరీ, వీరభద్రుడు కేవలం ఏడాదికొకసారే భక్తులకు దర్శనమిస్తారు. ఈ ఆలయాన్ని చాళుక్యుల కాలంలో నిర్మించినట్లు ఇక్కడి శిలాశాసనాల ద్వారా తెలుస్తోంది. ఇక్కడి శివలింగాన్ని అశ్వత్థాముడు ప్రతిష్ఠ చేసినట్లు ప్రతీతి. మహాభారత కాలంలో పాండవులను సంహరించాలని దుర్యోధనుడు అశత్థాముడిని ఆదేశిస్తే అంతట పాండవులనుకొని ఉపపాండవులైన బ్రాహ్మణులను సంహరించి తప్పిదం చేస్తాడు. ఈ విషయం తెలుసుకుని శ్రీకృష్ణుడి వద్దకు వెళ్లి జరిగిన ఘోరాన్ని వివరించి పాపపరిహార అడుగగా కోటి శివలింగాలను ప్రతిష్ఠించాలని ఆ వాసుదేవుడు సూచిస్తాడు. దీంతో అశ్వత్థాముడు నల్లమల అటవీప్రాంతంలోని గుండ్లకమ్మ నది వద్ద ఘోర తపస్సు ఆచరించి శివలింగాన్ని ప్రతిష్ఠించారని ఇతిహాసాల ద్వారా తెలుస్తోంది. గుండ్లకమ్మనదీ తీరాన ఉంటంతో గుండ్లబ్రహ్మేశ్వరంగా ఈ ప్రాంతం ప్రాచుర్యం పొందింది.


బ్రహ్మేశ్వరుడు

బ్రిటీష్ పాలకుల భవనాలు



దట్టమైన అభయారణ్యం ఉన్న ఈ ప్రాంతంలో బ్రిటీష్ పాలనా కాలంలో అంటే 1915 సంవత్సరంలో అటవీ రేంజ్ కార్యాలయం, గెస్టుహౌస్‌ను నిర్మించారు. 1945లో అప్పటి రేంజ్ అధికారి చేళీరు నంజప్ప అక్కడ తీగలపొదలతో కప్పిపోయి ఉన్న ఓ నిర్మాణాన్ని చూశాడు. ఈ విషయాన్ని నారాయణపురం, చిన్నదేవళాపురం గ్రామస్థులకు తెలిపి వారి ద్వారా తీగలను తొలగించి పరిశీలించగా శివాలయం బయటపడింది. నాటి నుంచి ఆవులపాటి పెద్దపుల్లయ్య, బోయ లింగన్న.. అర్చకుడు పెద్దయ్యగారి వెంకట శేషయ్యతో ఏటా శివరాత్రి పర్వదిన ఉత్సవాలు కలిసి నిర్వహిస్తున్నారు. ఈ ఆలయానికి చేరుకోవాలంటే నంద్యాల జిల్లా నారాయణపురం, వెలుగోడు, దిగువమెట్ట ప్రాంతాల నుంచి, ప్రకాశం జిల్లా పాపినేనిపల్లె నుంచి ఎటు వైపు నుంచి వెళ్లినా 42 కిలో మీటర్లు కాలినడకన, ట్రాక్టర్లు, జీపులలో ప్రయాణించి దర్శించుకోవాల్సి ఉంటుంది. ఈ క్షేత్రం ఉన్న గుండ్ల బ్రహ్మేశ్వరం రేంజ్‌ను వణ్యప్రాణి అభయారణ్యంగా గుర్తించటంతో కేవలం ఈ ఆలయ దర్శనం ఏడాదికొకసారి శివరాత్రి పర్వదినాన మాత్రమే కొనసాగుతోంది.

ఈ ఏడాది ఆలయ కమిటీ పెద్దలు జయన్న, శంకర్, నారాయణ, రాముడు ఈ నెల 26, 27 తేదీల్లో శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. అందుకోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. నారాయణపురం నుంచి ట్రాక్టర్ ద్వారా కొంత దూరం చేరుకోవాలి. అక్కడి నుంచి భక్తులు 10 కిలోమీటర్ల మేర కాలినడకన అటవీమార్గం నుంచి గుండ్లబ్రహ్మేశ్వరం చేరుకోవాల్సి ఉంటుంది. శివరాత్రి రోజున వచ్చే భక్తులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. అడవిలోకి అగ్గిపెట్టె, సిగరెట్లు, బీడీలు, ప్లాస్టిక్ వస్తువులను నిషేధించారు.


వీరభద్రుడు

వామ్మో.. ఘాట్ రోడ్డు ప్రయాణమా..?

- ప్రమాదకర మలుపుల నల్లమల
- వాహనం కండీషన్ కీలకం
- రహదారి నియమాలు పాటించకపోతే ప్రమాదాలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైల క్షేత్రంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే వాహనదారులు నల్లమల ఘాట్‌రోడ్‌లో అప్రమత్తంగా వ్యవహరించాల్సి అవసరం ఉంది. రహదారి నియమాలు పాటించకపోవడం, వాహనాలు కండీషన్ లేకపోవడంతో వంటి సమస్యలు చోటు చేసుకుంటే ప్రమాదాలకు తావిచ్చే అవకాశం ఉంటుంది. అదేవిధంగా సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే వాహనాలకు నల్లమల అటవీ ప్రాంతంలో మరమ్మతులు చోటు చేసుకుంటే అటవీ ప్రాంతంలో అగచాట్లను ఎదుర్కోక తప్పదు. ఈ నేపథ్యంలో డ్రైవర్లు తప్పనిసరిగా తమ వాహనాలను మంచి కండీషన్‌లో ఉంచుకోవాలని రవాణా శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా గూడ్స్ వాహనాల్లో భక్తులు తరలిరాకుండా జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. అసలే నల్లమల ఘాట్‌రోడ్‌లో అనేక మలుపులు ప్రమాదకరంగా ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఏదైనా ప్రమాదాలు చోటు చేసుకుంటే పెను నష్టం సంభవించే అవకాశాలు ఉన్నాయి.



అటవీ ప్రాంతంలో ప్రయాణిస్తున్న వాహనాలు

- వాహనం మరమ్మత్తులకు గురైతే మైనర్ రిపేర్లకు అవసరమయ్యే పరికరాలను వాహనంలో అందుబాటులో వుంచుకోవాలి. అలాగే గాలితో నింపబడిన ఒక టైర్‌ను అందుబాటులో ఉంచుకోవాలి.

రహదారి నియమాలు పాటించాలి

మహాశివరాత్రి పర్వదినాన్ని బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల మహాక్షేత్రానికి ప్రతిరోజు వేలాది సంఖ్యలో వాహనాలు తరలివస్తాయి. ఈనేపథ్యంలో నల్లమల ఘాట్‌రోడ్డులో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు వాహనచోదకులు తప్పనిసరిగా రహదారి నియమాలు పాటించాలి. అలాగే ప్రయాణంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వీలైంతవరకు రాత్రి వేళల్లో ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలి. డ్రైవర్లు సరైన విశ్రాంతి లేకపోతే నిద్రమత్తుకు లోనై ప్రమాదం జరిగే ఆస్కారం ఉంటుంది. ఘాట్ రోడ్డులో అనుభవజ్ఞులైన డ్రైవర్లు డ్రైవింగ్ చేయడం ఉత్తమం. ప్రత్యేకించి గూడ్స్ వాహనాల్లో ప్రయాణం ప్రమాదం. అందుకే గూడ్స్ వాహనాల్లో వెళ్లే ప్రయాణికులను నిలిపివేస్తున్నాము. వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్‌ను కూడా రద్దు చేసేలా చర్యలు చేపట్టాము.



\- సత్యనారాయణరెడ్డి, మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్, ఆత్మకూరు

వాహనాన్ని ఉంచుకోండి ఇలా..

- నల్లమలలోని ఘాట్‌రోడ్డు దిగేటప్పుడు కేఎంపీఎల్ మిగుల్చుకోవాలన్న ఉద్దేశంతో గేర్లను న్యూట్రల్ చేయవద్దని సూచిస్తున్నారు. ఇలా వేగంగా ఘాట్ దిగే వాహనాలకు ఎదురుగా మరోవాహనాలు వస్తే.. బ్రేక్ వేసేందుకు ఇబ్బందిగా ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో బ్రేక్‌ఫెయిల్ సంభవించవచ్చు. ఘాట్‌రోడ్డులో గేర్‌న్యూట్రల్ చేయరాదు.
- సాధ్యమైనంతవరకు నల్లమల అటవీ ప్రాంతంలోని ఘాట్‌రోడ్డు మలుపుల వద్ద నెమ్మదిగా వెళ్లాలి.
- వాహనం బయలుదేరే ముందు బ్రేక్, స్టీరింగ్ ప్లే, సైడ్‌మిర్రర్లు, డ్రైవర్ డోర్‌లాక్స్, డీజల్‌మీటర్లు, టైర్లలో గాలి, డీజిల్ లీకేజీ, ఇంజన్ ఫ్యాన్ బెల్ట్, క్లచ్ పెడల్‌ప్లేట్, చక్రాలకు బోల్టులు సరిచూసుకోవాలి. హ్యాండ్‌బ్రేక్‌ను పరిశీలించాలి.
- రాత్రివేళల్లో బ్రేక్‌లైట్లు, సైడ్‌ఇండికేటర్స్, డిమ్‌డిప్పర్ లాంటి సూచికలు పనిచేస్తున్నాయో లేదో సరిచూసుకోవాలి.
- అదేవిధంగా ఎయిర్‌లాక్ జరగకుండా జాగ్రత్తలు పాటించాలి. ఇంజన్ హీట్ జరగకుండా రేడియేటర్‌లో నీటిని నిల్వ వుంచేలా జాగ్రత్తలు చేపట్టాలి.

ఘాట్‌రోడ్‌లో వాహనం కండీషనే కీలకం



శ్రీశైలానికి వెళ్లే దారిలోని నల్లమల ఘాట్‌రోడ్డులో వాహనం తప్పనిసరిగా కండీషన్‌లో ఉంచుకోవాలి. బయలుదేరే ముందే ఆయా సమస్యలపై పరిశీలన చేసి ఏవైనా లోపాలు ఉంటే సరిచేసుకోవాలి. వాహనం కండీషన్ దెబ్బతింటే ప్రమాదాలు జరిగే అవకాశంతో పాటు అటవీ ప్రాంతంలోనే అవస్థలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రత్యేకించి ఘాట్‌రోడ్ దిగే క్రమంలో గేర్‌ను న్యూట్రల్ చేయకుండా వెళ్లడం మంచిది. మలుపుల వద్ద జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలి.

\- బీఎన్ అహ్మద్, సీనియర్ డ్రైవర్, ఆత్మకూరు ఆర్టీసీ డిపో

భృంగిపై శ్రీశైలేశుడు

(5వ పేజీ తరువాయి)


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకా తిరుమల నుంచి పట్టువస్త్రాలు : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం తరఫున ఆలయ ఈఓ కె.సత్యనారాయణమూర్తి, ఏఈఓ పి.నటరాజరావు, అర్చకులు భాను, వేదపండితులు సోమశేఖరశర్మ, వెంకటేశ్వరశర్మ పట్టువస్త్రాలను సమర్పించారు.

నేడు హంసవాహన సేవ : బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజైన శుక్రవారం స్వామిఅమ్మవార్లు హంసవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. అదేవిధంగా స్వామి, అమ్మవార్లకు విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర స్వామిఅమ్మవార్ల దేవస్థానం తరువున పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నిత్యాకళారాధన వేదిక, పుష్కరిణి ప్రాంగణంలోని భ్రామరీకళావేదిక, శివదీక్షాశిబిరాల ప్రాంగణంలో గురువారం సాయంత్రం సంప్రదాయ నృత్యప్రదర్శన, జానపద నాటకాలను ప్రదర్శించారు.


నృత్యం చేస్తున్న మహిళలు



వేషధారణలో కళాకారుడు


అమ్మ భాష.. ఆయన శ్వాస

ఉత్తర, ప్రత్యుత్తరాలన్నీ తెలుగులోనే
జడ్పీ ప్రభుత్వ ఉద్యోగి కృష్ణారెడ్డి ప్రస్థానం
నేడు మాతృభాష దినోత్సవం



2013లో నాటి అధికార భాష సంఘం చైర్మన్ మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా అవార్డు అందుకుంటూ..





కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సంస్కృతీ, సంప్రదాయంతో పాటు మంచి నడవడిక నేర్పేది మాతృభాష. తల్లి ఒడే బిడ్డకు తొలిబడి. అమ్మ మాటే మాతృభాష. తల్లి భాష లేనిదే మానవజాతికి వికాసం లేదు. ఇతర భాషలు ఎన్ని నేర్చుకున్నప్పటికీ... మాతృభాషలో ప్రావీణ్యుడు కానివాడు విజ్ఞాన సముపార్జన చేయలేడు. అలాంటి తల్లిభాష నేడు తల్లడిల్లుతోంది. పాశ్చాత్య పోకడల మాటున అమ్మభాషకు విఘాతం కలుగుతోంది. జీవితంలో పైకి ఎదగాలంటే ఇతర భాషలను నేర్చుకోక తప్పదు. కానీ వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా చూసుకోవాలి. మన మాతృభాషను మనమే రక్షించుకోవాలి. బాల్యం నుంచి మాతృభాషను క్షుణ్ణంగా నేర్చుకోవాలని, అప్పుడే మనిషి సంపూర్ణతను సాధిస్తాడని అంటున్నారు. తెలుగు భాషాభిమాని, పంచాయతీరాజ్ పీఐయూ కర్నూలు డివిజన్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న జీవీ కృష్ణారెడ్డి. ఆయన అధికారిక హోదాలో ఉత్తర, ప్రత్యుత్తరాలన్నీ తెలుగులోనే ఇస్తున్నాడు. తెలుగు భాషపై ఈయనకున్న అభిమానాన్ని గుర్తించిన ప్రభుత్వం 2016లో ఉత్తమ అధికారిగా గుర్తించింది. నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఉనందికొట్కూరు పట్టణానికి చెందిన గ్రంధి హనుమంతు, ఈశ్వరమ్మ దంపతులకు జన్మించిన జీవీ కృష్ణారెడ్డి ఎంఏ బీఈడీ చదివారు. క్రిష్ణగిరి మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి సీ.బెళగల్, కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహించారు. జడ్పీలో విధులు నిర్వహిస్తున్న సమయంలో మాతృభాష పట్ల ఆయన చేసిన కృషి గుర్తించిన అప్పటి జడ్పీ సీఈవో సూర్యప్రకాష్ ప్రోత్సహించారు. జడ్పీలోని ఉద్యోగులు, ఉత్తర, ప్రత్యుత్తరాలన్నీ మాతృభాషలోనే జరపాలని స్వయంగా ఆచరించారు. జీవీ కృష్ణారెడ్డికి మాతృభాషంటే ఎనలేని గౌరవం, ఉగ్గుపాలతో నేర్చుకున్న తెలుగుపై మమకారం పెంచుకున్నారు. రాబోయే కాలంలో ఆ మాతృభాష గొప్పదనం అందించాలనే ధ్యాస. అందుకే సాధ్యమైనంత వరకు మమ్మీ, డాడీ, అంకుల్, ఆంటీ అనే ఆంగ్ల పిలుపులకు చరమగీతం పాడాలని, అమ్మ, నాన్న, అత్త,మాతమ అనే పలకరింపులోని తియ్యదనాన్ని ఆస్వాదించాలని నిరంతరం పరితపిస్తున్నారు. క్రిష్ణగిరి మండల పరిషత్ కార్యాలయంలో 2013లో పరిపాలన అధికారిగా పదోన్నతి పొంది 3 సంవత్సరాలు ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేశారు.

ప్రస్తుతం కృష్ణారెడ్డి పంచాయితీరాజ్ కర్నూలు డివిజన్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ పత్రాలన్నింటిని అమ్మభాషలో తయారు చేస్తున్నారు. దీంతో ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందడమే కాకుండా 2013 సంవత్సరం ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర అధికార భాష సంఘం చైర్మన్ మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

అమ్మభాషను మరువరాదు



అమ్మ అనే పిలుపులో ఎంతో మాధుర్యం ఉంది. పుట్టుకతో వచ్చిన తల్లి భాషను మరచిపోతే మనుగడ ఉండదు. మారుతున్న కాలానికి అనుగుణంగా తల్లిదండ్రులు కూడా ఆంగ్లంలో తమ పిల్లలు మాట్లాడుతుంటే సంబరపడు తూనే ఉంటారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలకు చిన్నతనం నుంచే మాతృభాష పట్ల మమకారం పెరిగేలా కృషి చేయాలి.

- జీవీ కృష్ణారెడ్డి, పరిపాలన అధికారి, కర్నూలు

ఉర్దూ ఆశలు..!



కంకర తేలిన యూనివర్సిటీ ప్రధాన రోడ్డు

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వాలు శాశ్వతం కాదు. చేసిన అభివృద్ధి పనులే శాశ్వతం. ఏ ప్రభుత్వం వచ్చినా ముందు ప్రభుత్వం చేపట్టిన పనులు కొనసాగించాలి. అయితే ఇందుకు విరుద్ధంగా గత వైసీపీ ప్రభుత్వం వ్యవహరించింది. రాష్ట్ర విభజన తరువాత అప్పటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రానికి ఉర్దూ యూనివర్సిటీ ఉండాలనే మహోన్నత లక్ష్యంతో కర్నూలులో ఏర్పాటు చేయడంతో పాటు చేశారు. ఓర్వకల్లు దగ్గర విమానాశ్రయం పక్కనే సహజ సిద్ధమైన రాక్ గార్డెన్ సమీపంలో 144.92 ఎకరాలు ఈ వర్సిటీకి కేటాయించారు. ఫేజ్-1 కింద అడామిక్ బ్లాక్, బాలికల హాస్టళ్లు, విశాలమైన రోడ్లు నిర్మాణం కోసం చంద్రబాబు ప్రభుత్వం రూ.18 కోట్లు కేటాయించింది. హైదరాబాదుకు చెందిన యారో కన్‌స్ట్రక్షన్ సంస్థ పనులు చేపట్టింది. అకడమిక్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్ 75 శాతం, ఫస్ట్‌ఫ్లోర్ 25 శాతం పనులు చేశారు. బాలిక హాస్టళ్లు పునాది, పిల్లర్ల వరకు నిర్మించి సుమారు రూ.1.76 కోట్లు చేశారు. 2019లో వైసీపీ ప్రభుత్వం రావడంతో వర్సిటీకి శాపంగా మారింది. చంద్రబాబుకు మంచిపేరు వస్తుందనే దురుద్ధేశంతో జగన్ ప్రభుత్వం ఐదేళ్లు ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. పచ్చి మొక్కలు పెరిగాయి. అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. టీడీపీ ప్రభుత్వం ఆయాంలో 90 శాతం పూర్తి చేసిన చేసిన ఓర్వకల్లు విమానాశ్రయాన్ని మళ్లీ ప్రారంభించి.. ఎయిర్‌పోర్టు తామే నిర్మించినట్లు తమ తండ్రుల విగ్రహాలు పెట్టుకున్న గత వైసీపీ పాలక పెద్దలకు ఆ పక్కనే ముస్లిం విద్యార్థుల భవితను తీర్చిదిద్దే అసంపూర్తి ఉర్దూ యూనివర్సిటీ కనిపించకపోవడం ముస్లిం పట్ల వారికున్న చిత్తశుద్ధి ఏపాటితో తెలుస్తుందని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు.

రూ.31.26 కోట్లు ఇవ్వండి

2024 ఎన్నికల్లో ఘన విజయం సాధించి సీఎం చంద్రబాబు సారథ్యంలో మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఉర్దూ ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న ముస్లిం విద్యార్థుల్లో వర్సిటీ నిర్మాణాలపై ఆశలు చిగురించాయి. అసంపూర్తి ఉర్దూ విశ్వవిద్యాలయం పనులు ప్రారంభించి గడువులోగా పూర్తి చేస్తామని కర్నూలు జిల్లాకు చెందిన పరిశ్రమలు, వాణిజ్య, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్, నంద్యాల జిల్లాకు చెందిన మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ స్పష్టమైన హామీ ఇచ్చారు. మన ప్రభుత్వం రాగానే సీఎం చంద్రబాబు, విద్యా శాఖ, ఐటీ మంత్రి నారా లోకేశ్ ఉర్దూ వర్సిటీ నిర్మాణాలు చేపడతామని ప్రతిపక్షంలో ఉండగా హామీనిచ్చారు. శాశ్వత భవనాలు పూర్తి చేయడంతో పాటుగా యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించే నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోర్సులు (స్కిల్ డెవలప్‌మెంట్) ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా వర్సిటీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 2025-26 బడ్జెట్‌లో యూనివర్సిటీ ఉద్యోగులు, సిబ్బంది జీతాలకు రూ.4.56 కోట్లు, నిర్వహణ కోసం రూ.1.20 కోట్లతో పాటు శాశ్వత భవనాల నిర్మాణాలకు రూ.25.50 కోట్లు చొప్పున మొత్తం రూ.31.26 కోట్లు నిధులు ఇవ్వాలని వర్సిటీ అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. ఇటీవల ఆర్థిక శాఖ ముఖ్య అధికారులు యూనివర్సిటీల బడ్జెట్‌పై నిర్వహించిన సమీక్షలో కూడా అవసరమైన నిధులపై స్పష్టమైన నివేదిక ఇచ్చారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి సహా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితలు సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌పై ఒత్తిడి తీసుకొచ్చి ఉర్దూ వర్సిటీకి అవసరమైన నిధులు కేటాయించి ఏప్రిల్‌లో పనులు పునఃప్రారంభించాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

జర్నలిస్టులకు అండగా ఉంటాం

• టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి • ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సురేంద్రబాబు సంతాపసభ



సురేంద్ర కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న టీడీపీ నేతలు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు అండగా ఉంటామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ప్యాలకుర్తి తిక్కారెడ్డి వెల్లడించారు. ఇటీవల మృతి చెందిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కెమెరామెన్ సురేంద్రబాబు (చిన్నా) సంతాప సభ కర్నూలు జడ్పీ హాల్‌లో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ముఖ్య అతిథులుగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, టీడీపీ యువనేత కేఈ రుద్రగౌడ్, విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, టీడీపీ నేత పెరుగు పురుషోత్తమరెడ్డి తదితరులు హాజరయ్యారు. ముందుగా సురేంద్రబాబు చిత్ర పటానికి తల్లిదండ్రులు జాన్, కామేశ్వరి, భార్య నాగేశ్వరమ్మ, పిల్లలు హరిణి, రాజాదిత్య నివాళులు అర్పించారు.

తిక్కారెడ్డి మాట్లాడుతూ అతి చిన్న వయస్సులోనే సురేంద్రబాబు మృతి కలిచివేసే విషయమన్నారు. ఆయన కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టీడీపీ జాతీయ నేత చంద్రబాబు, యువనేత లోకేశ్‌తో చర్చించి, ఎన్టీయార్ ట్రస్టు ద్వారా పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అలాగే జిల్లాలో టీడీపీ నేతల ద్వారా సేకరించిన డబ్బు డిపాజిట్ చేసి పిల్లల భవిషత్తునకు ఉపయోగపడేలా చూస్తామని చెప్పారు. సురేంద్రబాబు భార్య నాగేశ్వరమ్మకు చదువుకు తగ్గ ఉద్యోగాన్ని, నివాసయోగ్యమైన గృహాన్ని ఇప్పిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ సురేంద్ర కుటుంబానికి తగిన న్యాయం చేస్తామన్నారు. కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పార్టీ కేంద్ర కార్యాలయం దృష్టికి తీసుకెళ్లి సురేంద్ర కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పారు. టీడీపీ నేత నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ ఒక నిబద్ధత కలిగిన కెమెరామెన్‌ను నేడు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ భవిషత్తులోనూ సురేంద్ర బాబు కుటుంబానికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఐజేయూ సభ్యుడు కె.నాగరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల కుటుంబ సంక్షేమానికి, భద్రతకు నిధులు కేటాయించి ఆదుకోవాలని కోరారు. ఐజేయూ సభ్యుడు గోరంట్ల కొండప్ప మాట్లాడుతూ సురేంద్ర బాబు తమలో ఒకడని, కుటుంబానికి సహాయ సహకారాలు అందిస్తూ, పిల్లల భవిషత్తుకు మంచి బాటలు వేస్తామని అన్నారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు మాట్లాడుతూ తమతో నిత్యం ప్రయాణం చేస్తూ వచ్చిన సురేంద్ర మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నామని, యూనియన్ పక్షాన కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు తిక్కారెడ్డి, గౌరు చరితారెడ్డి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు సురేంద్రబాబు కుటుం బానికి ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే రాయలసీమ జర్నలిస్టుల వెల్ఫేర్ అసోసియేషన్ పక్షాన కె. శ్రీనివాసులు, టి.రమేష్, ఎం.భూపాల్ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ ఆకుల లక్ష్మణ్, ఎడిషన్ ఇన్‌చార్జి చల్లా నవీన్ కుమార్ నాయుడు, డీసీఎం సోమశేఖర్ రెడ్డి, ఏడీవీటి మేనేజర్ గోపాల్, నంద్యాల స్టాఫర్ గోపాల్, ఏబీఎన్ సుంకన్న, యూనియన్ గౌరవాధ్యక్షుడు సుబ్బయ్య, తెలుగు మహిళ అధ్యక్షురాలు షేక్ ముంతాజ్ బేగం, నాయకులు డి.జేమ్స్, పి.హనుమంతరావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

గ్రూప్-2 పరీక్షలపై సమీక్షలో డీఆర్వో వెంకటనారాయణమ్మ



మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షలకు సంబంధించి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఏపీపీఎస్సీ గ్రూప్స్-2 పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో డీఆర్వో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 23న ఆదివారం జరిగే గ్రూప్-2 పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించేది లేదన్నారు. అభ్యర్థులు ఉదయం 9:30 గంటల వరకు గ్రేస్ పీరియడ్‌తో కలిసి 9:45 గంటల వరకు అనుమతిస్తామన్నారు. మధ్యాహ్నం సెషన్‌లో 2:30 గంటల నుంచి 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్ అంటే 2:45 గంటల వరకు అనుమతి ఉంటుందన్నారు. హాల్ టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలని అన్నారు.

జిల్లాలో 30 కేంద్రాల్లో 9,993 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. అభ్యర్థుల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నెంబర్. 08518-277305ను అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీఎస్సీ డిప్యూటీ సెక్రటరీ కుమార్ రాజు, అసిస్టెంట్ సెక్రటరీ వి.బాబురావు, డీఎస్పీ బాబు ప్రసాద్, సెక్షన్ ఆఫీసర్లు బ్రహ్మేశ్వరరావు, కే.సుధాకర్‌బాబు, ఏఎస్‌వోలు కేఎన్ఎస్ అనిల్ కుమార్, టి.ఆంజనయులు, ఏ.యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

వలసల నివారణకు చర్యలు తీసుకోవాలి

• జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి • ముగిసిన జడ్పీ స్థాయి సంఘం సమావేశాలు



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వలసల నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధికారులను ఆదేశించారు. పశ్చిమ ప్రాంతంలో పనులు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని, తక్షణమే కూలీల సంఖ్య పెంచాలని ఆయన అన్నారు. జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో గురువారం ఏడు స్థాయి సంఘ సమావేశాలు జరిగాయి. చైర్మన్ అధ్యక్షత వహించగా సీఈఓ జి.నాసరరెడ్డి పర్యవేక్షించారు. వలసల నివారణకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా వ్యవసాయ అధికారులపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టడంతో అధికారులు ఘోరంగా వైఫల్యం చెందారన్నారు. అస్సలు అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో హెచ్చుమీరిన అవినీతిని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆదోని మండలంలో కమ్యూనిటి, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పంటలకు నష్టపరిహారం సకాలంలో ఇచ్చే విధంగా కృషి చేయాన్నారు.

హరికిషన్‌కు జాతీయ పురస్కారం



కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన రచయిత, బాలసాహితీవేత్త డాక్టర్ ఎం.హరికిషన్‌కు కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన 'కొనిరెడ్డి ఫౌండేషన్' జాతీయ పురస్కారం గురువారం ప్రకటించారు. హరికిషన్ రాసిన బాలల కథల పుస్తకం 'చిలకముక్కు చిన్నోడు' జాతీయ స్థాయిలో ఉత్తమ తెలుగు బాలల కథల పుస్తకంగా ఎంపికైనట్లు కొనిరెడ్డి ఫౌండేషన్, చదువుల సాహిత్య కళావేదిక సంస్థ ప్రధాన కార్యదర్శి డీకే చదువుల బాబు తెలిపారు. కాలాను గుణంగా యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, టెలిగ్రాం, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల్లోనూ కథలు ప్రసారం చేస్తున్నారు. అలా ఆయన వాట్సాప్ గ్రూపుల ద్వారా 50వేలకు పైగా సబ్‌స్క్రైబర్లతో కథలు, బాలసాహిత్యాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. జాతీయ పురస్కారానికి ఎంపికైన చిలకముక్కు చిన్నోడు కథల పుస్తకంలో 23 కథలను చిన్నారుల్లో ఆలోచనా శక్తిని పెంపొందించేలా రాశారు. జాతీయ స్థాయిలో జరిగిన ఈ బాలల కథల పుస్తకాల పోటీకి తెలుగు రాష్ట్రాల నుంచీ అనేక మంది ప్రసిద్ధ రచయితులు పుస్తకాలు పంపించినా, హరికిషన్ పుస్తకం ప్రథమస్థానంలో నిలిచి పురస్కారానికి ఎంపికైంది. మార్చి 8న ప్రొద్దుటూరులో అవార్డుతో పాటు నగదు అందజేసి రచయిత హరికిషన్‌ను సత్కరించనున్నారు.

24న కిసాన్ నిధుల విడుదల

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఈ నెల 24న అర్హులైన రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ పథకం నిధులను విడుదల చేయనుంది. ఈ పథకం ద్వారా ఒక్కో రైతుకు రూ.2వేల చొప్పున ఖాతాల్లో జమ చేస్తారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4.5 లక్షల మంది రైతులు ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నారు. రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసేందుకు ప్రధాన నరేంద్ర మోదీ బీహార్ రాష్ట్రం బాదల్‌పూర్‌లో జరిగే కార్యక్రమంలో విడుదల చేయనున్నట్లు జేడీఏ వరలక్ష్మి తెలిపారు. ఎవరైనా ఇంకా లబ్ధి పొందకుంటే ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ప్రతి సంవత్సరం విడతల వారీగా రైతులకు రూ.6వేలు అందిస్తున్నారు. ఇప్పటి వరకు 18 విడతల ద్వారా రైతుల ఖాతాల్లోకి 2వేలను జమ చేశారు. దేశవ్యాప్తంగా 19వ విడ తలో 9.7 కోట్ల మంది అర్హులకు 2వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాలకు అందనున్నాయి.

హత్యకేసులో నిందితుల అరెస్టు



నిందితులను చూపుతున్న పోలీసులు

మద్దికెర, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామానికి చెందిన బీవీఆర్ యూట్యూబర్, న్యూస్ చానల్ విలేఖరి బి.తిరుమల్‌రెడ్డి హత్య కేసులో నిందితులను గురువారం సాయంత్రం అరెస్టు చేశారు. గుంతకల్లు సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ వెంకటస్వామి తెలిపిన మేరకు.. గుంతకల్లు మండలం సంగాల గ్రామానికి చెందిన జీవన్‌కుమార్‌కు నాలుగు ఎకరాల పొలం ఉండా, పక్కనే ఉన్న ఎకరా ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. ఈ విషయంపై తిరుమల్ రెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో పిర్యాదు చేయడమే కాకుండా డబ్బులు డిమాండ్ చేశాడు. దీంతో జీవన్ కుమార్ తిరుమల్ రెడ్డిపై కక్ష పెంచకుని బోయ రామాంజనేయులు, బోయ రామన్న సాయంతో ఈ నెల 17న గుంతకల్లు నుంచి హతుడు బుగ్గ సమీపాన గల తన తోటకు బైక్‌పై వెళుతుండగా ట్రాక్టరుతో గుద్ది కాలువలో పడేసి హత్య చేశారు. 18న మృతదేహం బయట పడింది. పోలీసులు విచారణ చేసి, నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సీఐ, ఎస్ఐలతో పాటు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్, కానిస్టేబుళ్లు జాఫర్, కిషోర్ కుమార్, రాఘవేంద్ర, నాగేశ్వరరావు, అంజి, నూర్ అహ్మద్‌ను డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు. నిందితుడు, హత్యకు ఉపయోగించిన ట్రాక్టర్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



దగ్ధమైన గుడిసె

ఆస్పరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిలేకల్ గ్రామంలో బోయ ఉచ్చరప్పకు చెందిన గుడిసె బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైంది. బాధితుడి కథనం మేరకు.. విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్‌తోనే ప్రమాదం చోటు చేసుకుని రూ.5లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. తిండి గింజలు, బంగారు, తదితరాలు దగ్ధమయ్యాయి. బాధితుడిని ఆదుకోవాలని గ్రామస్తులు వెంకటేష్, మహేష్, వీరేష్ కోరారు.

రైలు నుంచి జారిపడి వృద్ధుడి మృతి

కోసిగి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కోసిగి రైల్వేస్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. వివరాల మేరకు.. వృద్ధుడు జారిపడినట్లు గమనించిన వారు ఎస్ఐ చంద్రమోహన్‌కు ఇచ్చిన సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి ఏఎస్ఐ నాగరాజు, కానిస్టేబుళ్లు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఆదోని రైల్వే అధికారులకు సమాచారం అందించారు. ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా నమోదు చేశారు. ఆదోని రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఈ-శ్రమ్‌తో కార్మికులకు భద్రత

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈ-శ్రమ్ కార్డు ద్వారా అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రతా లభిస్తుందని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. గురువారం ఉదయం ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్ అంశంపై కార్మిక, ఇతర శాఖలు, అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అసంఘటిత రంగ కార్మికులకు ఈ-శ్రమ్ కార్డు అవసరమైన సమయాల్లో ఆసరాగా నిలుస్తుందన్నారు. జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికుల నమోదుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్మిక శాఖ డీసీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



CHANGE OF NAME

I, **MUNIMADUGUK ZAHEER** (Old Name) R/o. H.No:46/180-5, Budawara Peta, Kurnool dist, AP., have Changed my name as **MUNIMADUGU ZAHEER** (New Name) S/o.MAHABOOB BASHA.
AJL-229385

అన్ని కులాల సంబంధాలు

బిజినెస్, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ టీచర్స్, బ్యాంక్, పోస్టల్, రైల్వే, పోలీస్, సచివాలయం, డాక్టర్ సంబంధాలు కలవు. స్టార్ మ్యారేజ్ బ్యూరో, నంద్యాల జిల్లా. సెల్ : **87908 44959.** (2వ సంబంధాలు కలవు.)
AJL-229062

CHANGE OF NAME

I, **KODUMUR RUQIYA BEGUM** (Old Name) R/o. H.No : 4/343-39/2, Telecom Nagar, Adoni, Kurnool dist, AP., have changed my name as **KODUMUR RUQIA BEGUM** (New Name) W/o. KODUMUR KALEEM BASHA.
AJL-202849

CHANGE OF NAME

I, **N NABI RASOOL** (Old Name) H.No.3/50, Halaharvi, Nandavaram, Kurnool - 518360. Hereby Declare that I have Changed My Name as **SHAIK NABI RASOOL** (New Name) S/O SHAIK ALLABAKASH
AJL-229663

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ **7382114647**
AJA-226825

CHANGE OF NAME

I, **D SIVASUBBA LAKSHMAMMA SRILAM** (Old Name), H.No-11/336, Havannapeta Adoni kurnool 518301, Hereby Declare that I have Changed My Name As **S SUNEETHA** (New Name) W/o RAGHAVENDRA.
AJL-229662

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి



ప్రభుత్వ స్థలాలను గుర్తించండి



రెవెన్యూ అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న జేసీ

వెలుగోడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని జేసీ విష్ణుచరణ్ రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. గురువారం ఆయన వెలుగోడు మండలంలోని వేల్పనూరు గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వే పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. సర్వే చేపట్టిన సిబ్బందిని అడిగి ఆయన వివరాలను తెలుసుకున్నారు. సర్వేను ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. అలాగే వెలుగోడు పట్టణంలోని జగనన్న కాలనీని పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో నాగజ్యోతి, తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, డీటీ చంద్రశేఖర్, మండల సర్వేయర్ ఉపేంద్ర వెలుగోడు, వేల్పనూరు సర్వేయర్లు ఉన్నారు.

సూర్యనందీశ్వరుడి ఉత్సవాలకు రండి

మహానంది, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలంలో ప్రసిద్ధిగాంచిన సూర్యనంది ఆలయ మహా శివరాత్రి ఉత్సవాలకు రావాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి ఉత్సవాల ఆహ్వాన కమిటీ సభ్యులు కోరారు. గురువారం ఎమ్మెల్యేకు నందిపల్లి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఈశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, చెన్నయ్యపాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభకు మెరుగు

పాణ్యం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక సదస్సుల్లో విద్యార్థులు పాల్గొనడం ద్వారా వారి ప్రతిభ మరింత మెరుగుపడుతుందని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సాంకేతిక సదస్సు కన్‌క్యూరెన్స్ 2కే25 మూడవ రోజులో భాగంగా గురువారం ఈవెంట్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 19 కళాశాలలు ఇందులో పాల్గొన్నాయన్నారు. ఈనెల 22 వరకు ఈ సదస్సు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, హెచ్‌వోడీ డాక్టర్ సుబ్బారెడ్డి, కన్వీనర్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, నవీన్ సుందర్‌కుమార్ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి: ఆర్డీవో

పాణ్యం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ రీసర్వే సదస్సుల్లో వచ్చిన అర్జీలను ఈనెలాఖరులోగా పరిష్కరించాలని నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్ ఆదేశించారు. గురువారం పాణ్యం తహసీల్దారు కార్యాలయాన్ని ఆర్డీవో తనిఖీ చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన, పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. తమ్మరాజుపల్లెలోని 92 సర్వే నెంబరులో ప్రభుత్వ నిషేధిత భూముల జాబితాలో ప్రైవేటు భూమి నమోదు కావడంతో దాదాపు 80 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆర్డీవో దృష్టికి విలేకరులు తీసుకరాగా విచారించి తగిన న్యాయం చేస్తామన్నారు. సమావేశంలో డీటీ శివశంకర్‌రెడ్డి, ఆర్ఐ రాము, మండల సర్వేయరు నాగరాజు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు మోహన్‌రెడ్డి మృతి

- మాజీ ఎమ్మెల్యేలు, పలువురు నాయకుల పరామర్శ



నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి, మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జూపాడుబంగ్లా గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు సూదిరెడ్డి మోహన్‌రెడ్డి బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి టీడీపీ పార్టీకి తీరనిలోటని మాజీ ఎమ్మెల్యేలు బైరెడ్డి రాజశేఖరెడ్డి, లబ్బివెంకటస్వామి గురువారం అన్నారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, సుధాకర్, సైఫద్దీన్, బాలనారాయణగౌడు, అధికసంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పాటుపడుదాం: ఎంపీపీ

వెలుగోడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని ఎంపీపీ లాలం రమేశ్ అన్నారు. గురువారం వెలుగోడులోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. వెలుగోడు, వేల్పనూరు సర్పంచ్‌లు జయపాల్, సర్దార్‌మియ్యా వైస్ ఎంపీపీలు నసిరుద్దీన్‌బాబు, శంకర్ నాయక్ పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. అనంతరం పాడిపంటల పుస్తకాలను పశు వైద్యాధికారి కిశోర్ కుమారెడ్డి బీమా కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కొత్తపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు లింగాల నాగరాజు అలియాస్ రాముడు అన్నారు. గురువారం ఆయన కొత్తపల్లి కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

మహానందీశ్వరుడి హుండీ లెక్కింపు

మహానంది, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో గురువారం ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. ఆలయ ప్రాంగణంలోని అభిషేక మంటపంలో ప్రధాన ఆలయాల్లోని హుండీల్లో భక్తులు 68 రోజుల పాటు వేసిన కానుకలను లెక్కించగా రూ.58 లక్షల56వేల 681 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఏఈవో యర్రమల్ల మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, క్యాషియర్ నాగభూషణం, బాలాజీ సేవా ట్రస్ట్, తిరుమల బాలాజీ సేవాసమితి, భ్రమరాంబిక సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి కొలను శుభ్రం చేసిన అధికారులు

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల పాదయాత్రికుల కోసం నాగలూటి వీర భద్రాలయం ప్రాంతంలో తాగునీటి కొలనును గురువారం శుభ్రపరచారు. కార్యక్రమంలో వైద్యాధికారి గోపాల్, సీహెచ్‌వో అహ్మద్‌బాషా, ప్రవీణ్, భాస్కర్, విశ్వనాథ్, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని వైఎస్ఆర్ స్మృతివనం కాంపౌండ్ వాల్‌కు గల ఇనుప కడ్డీలకు ఉరి వేసుకుని ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్మృతివనం అటవీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

తాగునీటి ఎద్దడిపై దృష్టి సారించాలి

- ఎన్‌హెచ్-167కేలో నిజమైన లబ్ధిదారులను గుర్తించండి
- రాజకీయాలకు అతీతంగా మండల అభివృద్ధి
- నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



కొత్తపల్లి మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

కొత్తపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్నాయి.. గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటిపోక ముందే ముందస్తుగా తాగునీటి ఎద్దడి గ్రామాలు గుర్తించి నీటి సమస్య రాకుండా చూడాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఎంపీడీవో మేరీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ కిచ్చెన్నగారి కుసుమలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్‌హెచ్-167 కే కింద మండలంలో భూములు కోల్పోయిన నిజమైన లబ్ధిదారులను క్షేత్ర స్థాయిలో గుర్తించి వారికి న్యాయం చేయాలని తహసీల్దార్ ఉమారాణిని ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి పనులు, జగనన్న కాలనీలో మట్టి రోడ్ల నిర్మాణాల్లో భారీ ఎత్తున అవినీతి జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వెలుగోడు రిజర్వాయరు నుంచి మండలంలోని కొత్తమాడుగుల సంపు వెల్ నుంచి ఆయా గ్రామాల్లోని సబ్‌ట్యాంకుల ద్వారా తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే త్వరలోనే సంగమేశ్వరం నుంచి జానాల గూడెం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4.40 కోట్ల నిధులు మంజూరయ్యాయని త్వరలోనే భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. మండలంలోని ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో వైద్యాధికారులు విజయేంద్ర, మహ్మద్ భేగ్, పీఆర్ ఏఈ మద్దిలేటి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జుబేర్, హౌసింగ్ ఏఈ పాండురంగనాయక్, ఎంఈవో-2 ఇనయతుల్లా, ఏవో మహేష్, బీసీ హాస్టల్ వార్డెన్ షబ్బీర్, ఐటీడీఏ ఏపీవో రాజు నాయక్, మైనర్ ఇరిగేషన్ ఏఈ మురళీకృష్ణ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

లేగదూడల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టరు గోవింద నాయక్



నెహ్రూనగర్‌లో లేగదూడల పదర్శన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేడీ గోవిందనాయక్

పగిడ్యాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని పశుయజమానులు లేగదూడల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ గోవింద నాయక్ అన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నెహ్రూనగర్ గ్రామంలోని పశువైద్యశాలలో సర్పంచ్ రాజేశ్వరి ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జేడీ మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం ద్వారా కృత్రిమ గర్భధారణ చేయించడం వలన మేలు జాతి లేగదూడలు పుడుతాయన్నారు. పుట్టిన వెంటనే లేగదూడలకు నెలలోపు నట్టల నివారణ మందులను క్రమం తప్పకుండా మూడు సార్లు వేయడం వలన ఎలాంటి రోగాల బారిన పడకుండా ఉంటాయన్నారు. లేగదూడలకు మూడు నెలల వరకు పాలు తాపడం వలన ఆరోగ్యంగా ఉంటాయన్నారు. లేగదూడలకు నట్టల నివారణ , కాల్షియం టానిక్‌లు మందులను పంపిణీ చేశారు. ప్రదర్శనలో ఆకట్టుకున్న పశువుల యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టరు రాజశేఖర్, ఏడీ రామాంజనేయులు నాయక్, పశువైద్యాధికారులు శ్రుతి, రాగసంధ్య, వీఎల్‌వో శ్రీనివాసులు తదితరులున్నారు.

కలుషిత నీరు సరఫరా

- ఆందోళన వ్యక్తం చేసిన గ్రామస్థులు



కలుషిత నీటిని చూపుతున్న మహిళలు

నందికొట్కూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : కలుషిత నీటిని సరఫరా చేస్తున్నారని కొణిదేల గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో సరఫరా చేసిన నీరు దుర్వాసన వస్తోందని శుక్రవారం స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో కడిగిన ట్యాంకులను మరలా ఇప్పటిదాకా కడగలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్యాంక్ వద్ద అపరిశుభ్రంగా ఉందని, వాల్వులు కూడా భూమికి అనుకుని ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచుకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని గ్రామస్థురాలు వెంకటేశ్వరమ్మ ఆరోపించారు. సచివాలయ అధికారుల దృష్టికి తీసుకుని పోయినా ఫలితం లేకుండాపోయిందన్నారు. అధికారులు స్పందించి గ్రామంలో వ్యాధులు ప్రబలకముందే చర్యలు తీసుకోవాలని శుద్ధజలాన్ని సరఫరా చేయాలని వేడుకున్నారు. కొన్నిరోజులుగా దుర్వాసన వస్తున్న నీరు సరఫరా అవుతున్నాయని చెప్పినా పట్టించుకోలేదని గ్రామస్థుడు పర్వతాలు అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికే కాలనీలో ఒక వ్యక్తికి వాంతులు, జ్వరం రాగా ఆసుపత్రికి తరలించారన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహానందిలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



మహానందిలో ఎక్స్‌కవేటర్‌తో చదును చేయిస్తున్న అధికారులు

మహానంది, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో 8 రోజుల పాటు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. క్షేత్రానికి అత్యంత సమీపంలో భక్తుల వాహనాలు నిలిపేందు కోసం దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ పసుపుల సుబ్బారెడ్డి ఎక్స్‌కవేటర్ సహాయంతో శరవేగంగా తాత్కాలిక పార్కింగ్ పనులు చేపట్టారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే పూల కోనేర్ల పరిసరాల్లో ఎండ వేడిమి నుంచి ఉపసంహకరణ పొందేందుకు పెండల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మరో మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో శివరాత్రి పనులు పూర్తి అవుతాయని ఈవో పేర్కొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



తెలుగుతల్లి, పింగళిసూరన చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న సాహితీ సంస్థల ప్రతినిధులు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తేనెలొలుకు భాష తెలుగు భాష అని కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కిషోర్‌కుమార్ అన్నారు. నంద్యాల పింగళిసూరన గ్రంథాలయంలో గురువారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుతల్లి, పింగళిసూరన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ముఖ్యఅతిథి హాజరైన డాక్టర్ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులోనే రావాలని, తెలుగుభాష వికాసానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో రోటరీ సుబ్బయ్య, మురసం జిల్లా అధ్యక్షులు మహబుబ్‌భాషా, సాహితీ స్రవంతి అధ్యక్షులు శ్రీనివాసమూర్తి, రఫీ, గ్రంథాలయ అధికారి శ్రీధర్, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ఎదుట సంబరాలు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఆర్యవైశ్యులకు బీజేపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. ఢిల్లీ పీఠంపై ఆర్యవైశ్య మహిళ రేఖాగుప్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద నాయకులు, ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఇనుగూరి రమేష్‌బాబు, కొశెట్టి క్రిష్ణమూర్తి, చంద్రశేఖర్ ఆర్యవైశ్య మహిళా సభ్యులు పాల్గొన్నారు.

వంతెన నిర్మించాలి

పాములపాడు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కాల గ్రామ శివార్లలోని భవనాశి వాగు వద్ద వంతెన నిర్మించాలని మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి అంకన్న, నియోజకవర్గ అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం భవనాశి వద్ద మండల అధ్యక్షుడు జాన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారిన వంతెన నిర్మాణాలు చేపట్టక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాకాలంలో భవనాశి ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో పాములపాడు, కొత్తపల్లి మండలాలకు రాక పోకలు నిలిచి పోతున్నాయన్నారు. పాలకులు, అధికారులు స్పందించి వంతెన నిర్మాణపు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మహానంది, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలంలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ(మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, న్యూఢిల్లీ బృందం) ఉపాధిహామీ నిధుల ద్వారా 2021-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. గురువారం బృందం సభ్యులు సీనియర్ అకౌంట్ ఆఫీసర్ రాజేష్‌కుమార్, అకౌంట్ కన్సల్టెంట్ మామ్‌చంద్ మండలంలోని తమ్మడపల్లి, బుక్కాపురం గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధిహామీ నిధులతో నిర్మించిన సీసీ రహదారి,గ్రామ సచివాలయం, మినీ గోకులం షెడ్ నిర్మాణపనులను పరిశీలించారు. అనంతరం మహానంది ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నంద్యాల క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలోజి నాయక్, ఏపీఓ మనోహర్, పీఆర్ ఏఈ రాముడు, ఈసీ రామేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కొత్తూరులో దేవాదాయ శాఖ ఎస్ఈ పూజలు

పాణ్యం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దేవాదాయ శాఖ జోనల్ ఎస్ఈ సిగుప్ప సతీష్ కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది వారికి స్వాగతం పలికి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో ఎస్ఈ దంపతులను ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు,ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా నవోదయ 2.0

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నవోదయ 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందని నంద్యాల జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల పరిధిలోని నాటుసారా, గంజాయి, డ్రగ్స్ నిర్మూలన, పేదప్రజలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా బాగుండాలని, యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం నవోదయ 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖలు, ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. నాటుసారా, గంజాయి, మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నెం.8008828467, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 9440902586, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ 7989409125లకు అందించాలని ప్రజలను కోరారు. అలాగే టోల్ ఫ్రీ నెంబర్లు 144.05, 1972లకు సమాచారం అందించాలని కోరారు.

నేడు బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆన్‌లైన్ పత్రాలు, కుల, ఆదాయ, రేషన్‌కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని ఆయన కోరారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఆర్జీఎం విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పాణ్యం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్ తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన సభలో విద్యార్థులు తన్మయి, నవ్యశ్రీ, జయశ్రీసాయి, రాజేశ్వరి, మానస, తేజు, శ్రీధర్, గణానంద, వెంకటేశ్వర్లును అభినందించారు. ఈనెల 23న కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పీడీ వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా తిక్కస్వామి ఉరుసు



దర్గాలో పూజలు చేస్తున్న నిర్వాహకులు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నంద్యాల సాయిబాబానగర్‌లో శ్రీహజరత్ సయ్యద్‌షా షెహెన్‌షా (తిక్కస్వామి) ఉరుసు ఉత్సవాలను గురువారం ఘనంగా ప్రారంభించారు. నిర్వాహకులు మేలా పక్కీర్లతో వైభవంగా గంధం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం ఉరుసు , శని, ఆది, సోమవారాల్లో తిక్కస్వామి జాతరలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు షేక్ చాంద్‌బాషా తెలిపారు.

ఘనంగా గణిత దినోత్సవం

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నంద్యాల క్రాంతి నగర్‌లోని శాంతినికేతన్ సీబీఎస్ఈ పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. క్యాలిక్యులేషన్ విత్ అబాకస్ ఫ్రేమ్, త్రికోణసమితి లాంటి నిత్యజీవితంలో ఉపయోగపడే ప్రాజెక్టులు, గణితానికి సంబంధించిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ గణితాన్ని ఒక సబ్జెక్టుగా కాకుండా నిత్యజీవితంలో ఒక భాగంగా భావించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు సుధాకర్‌ను సత్కరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా సమగ్ర శిక్షా కార్యాలయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్(ఏసీఎంసీ) అసిస్టెంట్ సెక్టోరల్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రాజెక్టు కోఆర్డనేటర్ ప్రేమంత్‌కుమార్ కోరారు. డిప్యూటేషన్ ప్రాతిపదికన ఫారిన్ సర్వీస్ నిబంధనలను అనుసరించి పని చేసేందుకు అర్హులై ఉండి, 55 సంవత్సరాల లోపు వయస్సు కల్గి పాఠశాల సహాయకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీసీ తెలియజేశారు. పూర్తిచేసిన దరఖాస్తులను 24న సాయంత్రం 5గంటల లోపు జిల్లా సమగ్ర శిక్షా కార్యాలయంలో అందజేయాలని కోరారు.

నేడు,రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో నేడు, రేపు విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీ ట్రాన్స్‌కో ఆపరేషన్స్, మెయింటెన్స్ ఈఈ ప్రభాకర్ తెలిపారు. ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. నంద్యాల జిల్లా ప్రజలు సహకరించాలని ఈఈ కోరారు.

అంధుల పాఠశాలకు ఆర్థిక సాయం

పాణ్యం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా పసుపల గ్రామంలోని అంధుల పాఠశాలకు పాణ్యం విద్యార్థులు గురువారం ఆర్థిక సాయం అందించారు. అంధుల పాఠశాల నిర్వాహకులు సుధాకర్, మనోజ్ వినతి మేరకు విద్యార్థులు, పాఠశాల సిబ్బంది రూ. 18075ల విరాళం పోగు చేసి అందించారు. హెచ్ఎం మేరీ సునీత మాట్లాడుతూ విద్యార్థుల దానగుణం అలవరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాటు సారా స్థావరాలపై దాడులు

నందికొట్కూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాటు సారా స్థావరాలపై ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. గురువారం పట్టణంలోని నీలి షికారి పేటలో నిర్వహించిన దాడుల్లో నాటుసారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు ప్రసాద్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ జఫ్రుల్లా, హెడ్ కానిస్టేబుల్స్ కుమారి, శంకర్ నాయక్, కానిస్టేబుళ్లు రమీజాబీ, శివన్న, సంధ్యారాణిలు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆత్మకూరు ఎల్ఐసీ కార్యాలయంలో గురువారం ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. సీపీఎం నాయకులు ఏసురత్నం, రణధీర్,రామ్‌నాయక్, వీరన్న మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఉద్యోగులు నాగన్న, జబివుల్లా, రవి, శోభారాణి, సౌభాగ్యవతి, ఉమాదేవి, సుచిత్ర పాల్గొన్నారు.

అసిస్టెంట్ కమిషనర్‌గా వెంకటదాస్

నంద్యాల మున్సి పాలిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా వెంకటదాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పలువురు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన కమిషనర్ నిరంజన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలి



అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాస్

సున్నిపెంట, ఫిబ్రవరి 20 (ఆంధ్ర జ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కట్టుదిట్టంగా చేపట్టాలని రాష్ట్ర దేవాదాయ కార్యదర్శి వాడరేవు వినయ్ చంద్ ఉత్సవాల ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ ఆజాద్, దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావును ఆదేశించారు. గురు వారం శ్రీశైలం వచ్చిన ఆయన దేవస్థానం ఏర్పాటు చేసిన క్యూ కాంప్లెక్స్‌ను, లడ్డుప్రసాదాల కౌంటర్లను పరిశీలించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

గోస్పాడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ రాజకుమారి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలోని ఆర్వో ప్లాంట్‌లో లీకేజీ సమస్యను గుర్తించి మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. పాఠశాలలోని దస్త్రాలను, విద్యార్థుల హాజరుపట్టీలను ఆమె పరిశీలించారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వీరభద్రుడు

చాగలమర్రి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : చాగలమర్రి మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. గురువారం స్థానిక మండలపరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపీపీ వీరభద్రుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల స్థాయి అధికారులు ఆయా శాఖల పురోగతిని చదివి వినిపించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి రంగనేతాజీ మాట్లాడుతుండగా డీ వనిపెంట సర్పంచ్ బాలీశ్వరరెడ్డి అడ్డుకున్నారు. మండలంలో నకిలీ క్రిమిసంహారక మందులు విక్రయిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఎరువులు అక్రమంగా నిల్వ ఉంచి బ్లాక్‌లో విక్రయిస్తున్నారని ఏవోకు తెలియజేసినా ఎరువుల యజమానుల వద్ద లంచాలు తీసుకుని వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు రఫీ, ఆశీర్వాదమ్మ, తహసీల్దార్ రవి కుమార్, డీటీ విజయ్ కుమార్, ఈవోపీఆర్డీ తాహేర్ హుసేన్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్య కీలకం

చాగలమర్రి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్య చిన్నారులకు ఎంతో కీలకమైందని ఆళ్లగడ్డ సీడీపీవో తేజేశ్వరి అన్నారు. చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ శిక్షణ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్యాబోధన చేయాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా బోధన చేయాలని సూచించారు. పౌష్టికాహారంతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు ప్రభుత్వం చేపట్టిన జ్ఞాన జ్యోతిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వారం రోజులపాటు శిక్షణ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు అనురాధ, న్యామతుల్లా, సూపర్‌వైజర్ సుశీల, డీఆర్పీలు మాబు హుసేన్, రవి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాలను చేపట్టాలి

బనగానపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : సంస్థలో ఉద్యోగ నియామకాలను చేపట్టాలని ఎల్ఐసీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. గురువారం బనగానపల్లె ఎల్ఐసీ కార్యాలయం ఎదుట యూనియన్ బనగానపల్లె కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, అధ్యక్షుడు వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతకాలంగా క్లాస్3, క్లాస్ 4 తరగతుల్లో ఉద్యోగ నియామకాల చేపట్టడం లేదన్నారు. వెంటనే నియామకాలు చేపట్టాలన్నారు. ఆల్‌ఇండియా ఇన్సురెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు గుర్తింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, ఎస్ఎం.డీ ఖాశీం, జయకర్ పాల్గొన్నారు.

వీసీ నియామకంపై హర్షం

ప్యాపిలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ నూతన వీసీగా గిరిజన మహిళ ప్రసన్న నియామకంపై టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి మధుకుమార్ గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అణగారిన వర్గానికి చెందిన మహిళకు వీసీ పదవి ఇవ్వడంపై ఆయన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

డోన్ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పురస్కరించుకుని డోన్ నుంచి శ్రీశైలానికి ప్రత్యేక సర్వీసులు ఉదయం 6 నుంచి 7 గంటలకు, మధ్యాహ్నం 1 గంటకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా ప్రయాణీకులకు, భక్తులకు శ్రీశైలానికి 50 మంది భక్తులు ఉంటే వారికి బస్సును ఏర్పాటు చేస్తామని తెలిపారు. డోన్ నుంచి శ్రీశైలానికి పెద్దలకు చార్జీలు రూ.435లు, పిల్లలకు రూ.250లు నిర్ణయించినట్లు తెలిపారు. ప్రయాణీకులను బట్టి ఇంకా బస్సు సర్వీసులు నడిపేందుకు కృషి చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. ఈ ఘటన గురువారం మండలంలో చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించి సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొర్విమానుపల్లె గ్రామానికి చెందిన వర్రా సునీత(20) కుటుంబ సభ్యుల వేధింపులతో ఈనెల 4న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఆమెను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స పొందుతూ మృతి చెందింది. సునీత తల్లి సుజాత ఫిర్యాదుమేరకు భర్త మొలక శ్రీనాథ్, మామ శ్రీనివాసులుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

GENERAL NOTICE

అందరికీ తెలియపరచడం ఏమనగా మా కక్షిదారులు Shriram Finance Ltd. Dhone Branch వారు ఈ క్రింద ఉదహరించిన షెడ్యూలు Property ని Mortgage చేసుకొని **Nese Rajesh, S/o. Nese JayaRaju** అను వారికి లోన్ ఇవ్వచున్నారు. కావున ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల 7 రోజులలో తెలుపవలెను.

SCHEDULE OF THE PROPERTY

The plot No **5**, situated in Kurnool Registration district, (Now Nandyala), Dhone Sub Registration district, in Survey bearing no **173/B**, in **17th** ward, of Dhone Village, Dhone Municipality area and Mdl, Kurnool Dt., Now Nandyal Dt. **Measurements :** East-West: 20 feet, North-South : 43.6 feet. Total **96.88** Sq.Yards **Boundaries : East :** Plot No 06 belongs to Ness Venu Kumar, **West :** Plot No 4 belongs to Chidege Somasekhar, **North :** 22 feet vide Road, **South :** Kurukundu Sekhar land.

G.Madhusudhan Rao,
Advocate, Dhone, Kurnool.

శవం లభ్యం

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో బాదుగుట్ట గనుల్లో ఓ వృద్ధుడి శవం గురువారం లభ్యమైనట్లు కొలిమిగుండ్ల పోలీసులు వెల్లడించారు. కాగా మృతుడు అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన మంజుల బొజ్జన్న(72)గా వారి కుటుంబ గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇటిక్యాలలో వైద్య శిబిరం

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇటిక్యాల గ్రామంలో రామ్‌కో సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ వారి ఆదేశాలమేరకు క్షయ వ్యాధి నివారణలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు రామ్‌కో యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు వెల్లడించారు. డాక్టర్ శ్రీధర్ వైద్య చికిత్సలు నిర్వహించగా, మైన్స్ జీఎం అజ్మల్‌అహ్మద్, డీఎం జీయాలజీ నాయుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

GENERAL NOTICE

అందరికీ తెలియపరచడం ఏమనగా మా కక్షిదారులు Shriram Finance Ltd. Dhone Branch వారు ఈ క్రింద ఉదహరించిన షెడ్యూలు Property ని Mortgage చేసుకొని **Rangapuram Nagamaddi, S/o. R.Peda Maddileti** అను వారికి లోన్ ఇవ్వచున్నారు. కావున ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల 7 రోజులలో తెలుపవలెను.

SCHEDULE OF THE PROPERTY

The House bearing no **B-77**, situated in Nandyala Registration district, in survey bearing no **52** of Chinthalapeta Village, Kochervu Revenue Village, Dhone Mdl, Nandyal Dt. **Site Measurements :** East-West: 66.2 feet, North-South : 17.5 feet. Total **128.72** Sq.Yards **House Measurements :** East-West: 13.3 feet, North-South : 15.7 feet. Total **208.81** Sq.feet **Boundaries : East :** P.Suryanarayana House and 5feet vide Road, **West :** P.Maranna House, **North :** Rangapuram Aseerwadamma House, **South :** Road.

G.Madhusudhan Rao,
Advocate, Dhone, Kurnool.

సద్వినియోగం చేసుకోండి

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పశుగ్రాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొలిమిగుండ్ల పశువైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు గురువారం తెలిపారు. రైతులు ఒక ఎకరం పొలంలో గడ్డి సాగు చేసుకుంటే ప్రభుత్వం సంవత్సరానికి రూ.33వేలు అందజేస్తుందని తెలిపారు.

రైతులకు వరం.. ఉల్లి నిల్వ గోదాములు

- రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాత


గోపాల నగరంలో రైతు ఏర్పాటు చేసుకున్న ఉల్లిగడ్డల నిల్వ గోదాం

డోన్‌రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులకు ఉల్లి నిల్వ గోదాములు వరంగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉల్లిగడ్డ రైతులకు 50 శాతం రాయితీ ఇస్తూ ఉల్లిగడ్డల నిల్వ గోడౌన్ ఏర్పాటుకు ప్రోత్సహిస్తుంది. ఉల్లిగడ్డ నిల్వ గోడౌన్ ఖర్చు రూ.1.75 లక్షలు వస్తుంది. వీటిలో ప్రభుత్వం 50 శాతం అంటే రూ.88వేలు రాయితీ ఇస్తుంది. డోన్ నియోజకవర్గంలో ప్యాపిలి మండలం గోపాలనగర్‌లో రైతు ఎర్రిస్వామి, తనకున్న ఐదెకరాల్లో రబీ సీజన్‌లో ఉల్లి సాగు చేశాడు. చేతికొచ్చిన ఉల్లి పంట ఉత్పత్తులను నిల్వ ఉంచుకునేందుకు ఉద్యాన శాఖ వారికి దరఖాస్తు పెట్టుకున్నాడు. ఇందులో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన 50 శాతం రాయితీతో ఉల్లిగడ్డ నిల్వ గోడౌన్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. ఇందులో ప్రస్తుత పంట ఉల్లిగడ్డ పంట ఉత్పత్తులు 25 మెట్రిక్ టన్నుల ఉల్లిని నిల్వ ఉంచుకున్నాడు. డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి మండలంలో 474 ఎకరాల్లో డోన్ మండలంలో 1380 ఎకరాల్లో ఉల్లి పంటను రైతులు సాగు చేశారు. మార్కెట్‌లో ప్రస్తుతం క్వింటం 2,600 నుంచి రూ.3వేల దాకా ధర పలుకుతోంది. మంచి ధర వచ్చేంత వరకు ఉల్లిగడ్డలు అధిక రోజులు నిల్వ ఉంచుకునేందుకు ఉల్లిగడ్డ గోడౌన్లు నిల్వ ఉపయోగకరంగా ఉంటాయనీ ఉద్యాన శాఖ అధికారులు అంటున్నారు.

ఎంతో ప్రయోజనకరం



ఉల్లిగడ్డ నిల్వ గోడౌన్ ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుంది. ఉల్లిగడ్డ ఉత్ప త్తులు మార్కెట్‌లో అమ్ముకునేలోపు ఉల్లిగడ్డలు చెడిపోకుండా నిల్వ ఉంచుకునేందుకు ఉల్లిగడ్డ నిల్వ గోడౌన్‌ను ఎంతో ప్రయోజనకరంగా ఉంది.

- ఎర్రిస్వామి, రైతు, గోపాల నగరం, డోన్

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



ఉల్లిగడ్డల నిల్వ గోడౌన్ ఏర్పాటు వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. ప్రభు త్వం ఇచ్చే 50శాతం రాయితీతో రైతులకు కలిగే ప్రయోజనం గురించి వివరిస్తున్నాం. ఉల్లిగడ్డల నిల్వ గోడౌన్ల ఏర్పాటుకు రైతులను ప్రోత్సహిస్తున్నాం.

- కళ్యాణి, ఉద్యాన శాఖ అధికారి, డోన్

డాక్టర్ ఎంపీ మద్దిలేటిరెడ్డికి పద్మశ్రీ అవార్డు ఇవ్వాలి


మద్దిలేటిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సముద్రశాస్త్ర వేత్త డాక్టర్ ఎంపీ మద్దిలేటిరెడ్డి సముద్రంపై చేసిన పరిశోధనలకు పద్మశ్రీ అవార్డును కేంద్రప్రభుత్వం ఇవ్వాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి కోరారు. నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం సుద్దమల్ల గ్రామానికి చెందిన సముద్రశాస్త్రవేత్త మద్దిలేటిరెడ్డి ఇటీవల మృతి చెందారు. కర్నూలులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మద్దిలేటిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి బీసీ రాజారెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ సముద్రశాస్త్రవేత్త మద్దిలేటి రెడ్డితో తనకు ఎంతో ఆత్మీయ అనుబంధం ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సముద్రాలను పరిశీలించి వాటిపై ఆరు పుస్తకాలను మద్దిలేటిరెడ్డి రచించారన్నారు. ఆయన రచించిన సముద్రశాస్త్ర గ్రంథాలను అన్ని యూనివర్సిటీల్లో పాఠ్యాంశాలుగా చేర్చి విద్యార్థులకు బోధిస్తున్నారన్నారు. ఇంత గొప్ప వ్యక్తి సేవలను కేంద్రప్రభుత్వం గుర్తించాలని కోరారు. లండన్‌లోని లైబ్రరీలో వరల్డ్ హూ ఈజ్ హూ అనే పుస్తకంలో ఇండియా నుంచి పేర్కొనబడ్డ ముగ్గురు ప్రముఖుల్లో మద్దిలేటిరెడ్డి ఒకర న్నారు. కెనడాలో ఉద్యోగం చేస్తున్న ఆయన పుట్టిన నేలపై ఉన్న మమకారంతో భారతదేశానికి వచ్చి సముద్రంపై అనేక పరిశోధనలు చేసి దేశానికి సేవలందించారన్నారు. సముద్రశాస్త్రంపై అనేక సేవలందించారన్నారు. ఆయన సేవలను గుర్తించి కేంద్రప్రభుత్వం పద్మశ్రీ ఇచ్చి గౌరవించాలని బీసీ రాజారెడ్డి కోరారు.

రాలిపోతున్న మామిడి పిందెలు, కాయలు

- ఆందోళనలో రైతులు

రుద్రవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : కంటికి రెప్పలా కాపాడుకున్న మామిడితోటల్లో పిందె, కాయ రాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాదైనా మామిడి కాపు బాగుంటుందని ఆశిస్తే నిరాశే మిలిగిందని మామిడి రైతులు వాపోయారు. రుద్రవరం మండలంలో ఆలమూరు, రుద్రవరం, వెలగలపల్లె, కొండమాయపల్లె, పెద్దకంబలూరు, చిన్నకంబలూరు, కోటకొండ గ్రామాల్లోమామిడి రైతులు మామిడి తోటలు సాగు చేశారు. మామిడి పిందెలు, కా యలు పసుపురంగులోకి మారి రాలిపోతున్నాయని రైతులు వాపోయారు.

సీసీ రోడ్డును పరిశీలించిన ఎంపీడీవో

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చెత్త సంపద కేంద్రం వద్ద నిర్మించిన సీసీ రోడ్డును ఎంపీడీవో ఉమామహేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రూ. 10 లక్షల మండల పరిషత్ నిధులతో రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. రోడ్డును నాణ్యతగా నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జయరామిరెడ్డి, బాష ఉన్నారు.

ప్రతి రైతు అగ్రిఫార్మర్ కార్డు పొందాలి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతు అగ్రి ఫార్మర్ కార్డు పొందాలని కోవెలకుంట్ల మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని సౌదరిదిన్నె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రస్తుతం వివిధ పంటల్లో వస్తున్న దిగుబడి, మార్కెట్ రేట్ల గురించి చర్చించారు.

కర్నూలుకు వెళ్లే బస్సుల దారి మళ్లింపు

బేతంచెర్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 340బి రోడ్ల మరమ్మతుల కారణంగా కోవెలకుంట్ల నుంచి బేతంచెర్ల మీదుగా కర్నూలు వెళ్లే బస్సులను గురువారం నుంచి దారి మళ్లించినట్లు కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ తిరుపతయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కర్నూలుకు వెళ్లే బస్సు చార్జీలను కూడా చార్టు 141 ప్రకారం ప్రయాణీకుల బస్ చార్జీలను కండక్టర్లు ప్రయాణీకులకు అందజేయాలన్నారు. కర్నూలు వెళ్లే బస్సులు బేతంచెర్ల తమ్మరాజుపల్లె మీదుగా బస్సులు కర్నూలు వెళ్లేందుకు దారి మళ్లించినట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని బస్సు డ్రైవర్లు, కండక్టర్లు గమనించాలని కోరారు.

శ్రీగిరికి తరలిన శివస్వాములు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో శివ మాలాధారులు గురువారం పెద్ద ఎత్తున శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. గత 40రోజులుగా కఠోర దీక్ష స్వీకరించిన శివస్వాములు గురువారం ఇరుముడి ధరించి శ్రీశైలం వెళ్లారు. ఈసందర్భంగా అంకిరెడ్డిపల్లె గ్రామంలోని గీతాశ్రమంలో సాంప్రదాయ పూజలు నిర్వహించి, గ్రామంలో ర్యాలీగా వెళుతుండగా పలువురు శివస్వాములకు పూజలు చేశారు.

మెరుగైన సేవలు అందించాలి


సమావేశంలో చర్చిస్తున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి

డోన్ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన సేవలు అందించాలని డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చిన్నమల్కాపురం గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు బద్దెల రాజ్‌కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చెన్నకేశవులు, గ్రామ సర్పంచ్ లక్ష్మి ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుపదార్థాల నిర్మూలనకు 'నవోదయం'

బనగానపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాల నిర్మూలనకు నవోదయం-2 కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని ఇందుకు ప్రజలు సహకరించాలని బనగానపల్లె ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి గురువారం తెలిపారు. బనగానపల్లె పరిధిలో నాటుసారా, డ్రగ్స్, గంజాయి నిర్మూలన ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు లోనై ఆర్థికంగా చితికిపోతున్నారన్నారు. నాటుసారా, మత్తు పదార్థాల సరఫరాకు సంబంధించి ఫిర్యాదులు అందించాల్సి వస్తే 14405, 1972 నంబరుకు ఫోన్ చేయాలని ప్రజలను కోరారు.

జగదీష్‌కు అభినందనలు

డోన్ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కరాటేలో కర్నూలు చెందిన కరాటే మాస్టర్ జగదీష్ ప్రతిభ చూపడం అభినందనీయమని కర్నూలు జిల్లా స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ కార్యదర్శి కరాటే మాస్టర్ రమణ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ యూఏఈలో ఫజరయైలో జరిగిన వరల్డ్ కరాటే ఫెడరేషన్ నిర్వహించిన జడ్జి-బీ పరీక్షలో కర్నూలు చెందిన జగదీష్ ఉత్తీర్ణత సాధించడం చాలా అభినందనీయమన్నారు. డబ్ల్యూకేఎఫ్ జడ్జిగా ఏపీలో మొట్టమొదటి వ్యక్తిగ జగదీష్ ఉన్నారనీ వివరించారు. కేఎస్‌కేడీఏ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, సహ కరాటే మాస్టర్స్ అభినందనలు తెలియజేశారు.

రేపటి నుంచి వెంకటరెడ్డి తాత ఉత్సవాలు

ప్యాపిలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం నుంచి వెంకటరెడ్డి తాత తిరుణాల ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు రెండు రోజుల పాటు జరగనున్నాయి. ఈ మేరకు ఆలయానికి నిర్వాహకులు రంగులు వేశారు. తిరుణాలకు ఆడపడుచులు, బంధువులు తరలి వస్తుండటంతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది.

నేడు రుణాలకు ఇంటర్వ్యూలు

డోన్ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): డోన్ మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సంబంధిత బ్యాంకు మేనేజర్లతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ అప్లికేషన్, ఆధార్, రేషన్ కార్డు కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు అకౌంటు పాస్‌బుక్‌లతో హాజరు కావాలని కోరారు.

బేతంచెర్ల: కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు బేతంచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు సంబంధిత సర్టిఫికెట్లను తీసుకుని హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు.

కొలిమిగుండ్ల : బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తులను శుక్రవారం వెరిఫికేషన్ చేయనున్నట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి గురువారం వెల్లడించారు. ఎంపీడీవో మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు దరఖాస్తుదారులు దరఖాస్తులకు సంబంధించిన అన్ని వివరాలతో హాజరు కావాలని తెలిపారు. బ్యాంక్ మేనేజర్ల సమక్షంలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

ప్యాపిలి: మండల కార్యాలయంలో ఈనెల 21న ప్యాపిలి, పోతుదొడ్డి, నల్లబల్లి, కలచట్ల, మెట్టుపల్లి, వెంగళాంపల్లి, గుడిపాడు, పెద్దపూదిళ్ల, ఎస్ రంగాపురం, 22న బూరుగుల, మాధవరం, మునిమడుగు, నేరేడుచెర్ల, రాచెర్ల, కొమ్మెమర్రి, జక్కసానికుంట్ల, జలదర్గం, చంద్రపల్లి గ్రామాల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు గురువారం తెలిపారు.

సంజామల : మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సంజామల ఎంపీడీవో సాల్మన్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ భవనంలో జరిగే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు హాజరు కావాలని కోరారు.

కోవెలకుంట్ల : కోవెలకుంట్ల పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వరప్రసాదరావు తెలిపారు. అభ్యర్థులు హాజరుకావాలని కోరారు.

అవుకు: కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుక్ను అభ్యర్థులు శుక్రవారం ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఎంపీడీవో వెంగన్న గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అవుకు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ అధికారులు, బ్యాంక్ మేనేజర్ల సమక్షంలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

బనగానపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. దరఖాస్తుదారులు భారీగా తరలి వచ్చారు. వ్యక్తిగత వెరిఫికేషన్ కార్యక్రమం బ్యాంకర్లు, ఎంపీ డీవో రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొత్తం 1900 మంది నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తు చేసుకోగా తొలిరోజు 1300కు పైగా వెరిఫికేషన్‌కు హాజరైనట్లు ఎంపీడీవో తెలిపారు. శుక్రవారం కూడా వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

ఉయ్యాలవాడ: సబ్సిడీ రుణాల దరఖాస్తులను ఆయా బ్యాంకుల అధికారులతో కలిసి ఎంపీడీవో ఉమమహేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఇంటర్వ్యూకు 127 మంది హాజరు కావాల్సి ఉండగా కేవలం 26 మంది మాత్రమే హాజరైనట్లు ఎంపీడీవో తెలిపారు. శుక్రవారం కెనెరా బ్యాంకు సంజామల, స్టేట్ బ్యాంకు ఆళ్లగడ్డ అధికారులు వచ్చి తుడుమలదిన్నె, సర్వాయిపల్లె, కొండుపల్లె గ్రామ అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలిస్తారన్నారు.

ఏపీలో కులగణన చేపట్టాలి

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు


మాట్లాడుతున్న రామాంజనేయులు

డోన్ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం తరహాలోనే ఆంధ్రప్రదేశ్‌లో కూడా కులగణన చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనుకబడిన అనగారిన కులాలకు అనేక రాజకీయ ఉద్యోగ ఆర్థిక సానుకూలంగా అవకాశాలు రాకుండా వెనుకబడ్డారన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఎం.రాముడు, మండల కార్యదర్శి నారాయణ, పట్టణ సహాయ కార్యదర్శి రామ్మోహన్, ఏఐటీయూసీ కార్యదర్శి అబ్బాస్, మహిళా నాయకులు లక్ష్మిదేవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులు నమోదు

చాగలమర్రి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లా వ్యాప్తంగా 1,200 విద్యుత్ చౌర్యం కేసులు నమోదు చేసినట్లు విద్యుత్ శాఖ విజిలెన్స్ ఈఈ గోపి తెలిపారు. గురువారం చాగలమర్రి పట్టణంలోని రైస్ మిల్లులు, వాణిజ్య సముదాయాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన మూడు నెలల కాలంలో విద్యుత్ చౌర్యంపై 1,200 కేసులు నమోదు చేసి దాదాపు రూ.20 లక్షలు జరిమానా విధించామన్నారు. ఇటీవల చాగలమర్రి మండలంలోని ముత్యాలపాడు, డీ వనిపెంట, కొత్తపల్లె గ్రామాల్లో విస్తృత దాడులు చేసి 102 కేసులు నమోదు చేసి రూ.1.5 లక్షల జరిమానా విధించామన్నారు. దాడుల్లో విజిలెన్స్ డీఈ కృష్ణమూర్తి, ఏఈ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి బాధాకరం

చాగలమర్రి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : చాగలమర్రి మండలంలోని తోడేళ్లపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వంశీ రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందడం బాధాకరమని ఆళగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. వంశీ మృతదేహంపై పూలమాల వేసి ఎమ్మెల్యే గురువారం సంతాపం ప్రకటించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, హుసేన్‌రెడ్డి, రామ్మోహన్, సంజీవరాయుడు, హరి పాల్గొన్నారు.

శివస్వాములు శ్రీశైలానికి పాదయాత్ర

చాగలమర్రి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయంలో 108 రోజులు శివ దీక్ష చేపట్టిన శివస్వాములు గురువారం ఇరుముడితో శ్రీశైలం క్షేత్రానికి పాదయాత్రతో తరలివెళ్లారు. ఆలయంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వల్లంకొండు సాయి ఆధ్వర్యంలో శివ స్వాములు రమేష్, రాజేష్, నాగేంద్ర, రమణ, సువర్ణ, శివయ్య పాల్గొన్నారు.

ఇది సంపన్నుల బడ్జెట్: సీపీఎం

డోన్ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ప్రవేశ పెట్టిన బడ్జెట్ సంపన్నుల ప్రయోజనాలకే పెద్దపీట వేసిందని సీపీఎం పట్టణ మండల కార్యదర్శులు కోయలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా పట్టణంలోని బేతంచెర్ల రోడ్డులో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు రామాంజనేయులు, చిన్న రెహిమాన్, లోక్‌నాథ్, నరసింహ పాల్గొన్నారు.

గోవిందపల్లెలో శ్రీరామ జపయజ్ఞ సప్తాహం

శిరివెళ్ల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందపల్లె సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో మార్చి 17 నుంచి 24వ తేదీ వరకు అఖండ శ్రీరామ జయరామ నామ జపయజ్ఞ సప్తాహం నిర్వహించనున్నట్లు నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు వైవీ రామయ్య గురువారం తెలిపారు. జపయజ్ఞ సప్తాహంలో భాగంగా మార్చి 22న భగవత్ గీతా ప్రచారకులు రాధా మనోహర్ దాసు, 23న కవి డాక్టర్ గరికపాటి నరసింహారావు, 24న కాకనూరు శారదాపీఠం శివయోగేంద్ర సరస్వతి స్వాములవారి ప్రవచన సందేశాలు ఉంటయని పేర్కొన్నారు.

మాట నిలుపుకున్న సీఎంకు ధన్యవాదాలు

- డోన్ ఎంహెచ్‌పీఎస్ సయ్యద్ ఇద్రూస్ బాషా



కరపత్రాలను చూపిస్తున్న ఎంహెచ్‌పీఎస్ నాయకులు

బేతంచెర్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు నాయుడుకు, మైనార్టీ న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి డోన్ నియోజకవర్గం అధ్యక్షుడు సయ్యద్ ఇద్రుస్ బాషా, సయ్యద్ హుశేన్‌బాషా సయ్యద్ ఆంజాద్ బాషా, షేక్ కలాం ధన్యవాదాలు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇమామ్, మౌజన్ల వారి కష్టాలను గుర్తించి మొదటిసారిగా గౌరవ వేతనం తీసుకువచ్చి ఆదుకున్న నాయకులు చరిత్ర పుటల్లో చిరస్థాయిగా ఉండే పేరు సీఎం చంద్రబాబుకే దక్కుతుందని అన్నారు. సమావేశంలో ముస్లిం మత పెద్దలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

యుద్ధ గర్జన సభను విజయవంతం చేయాలి

అవుకు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఈనెల 23న నిర్వహించనున్న రాయలసీమ మాలల యుద్ధ గర్జన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు ఓబయ్య అన్నారు. గురువారం మండలంలోని శివవరం గ్రామంలో మాలమహానాడు నాయకులతో సమావేశాన్ని నిర్వహించి కరపత్రాలను విడుదల చేశారు. ఓబయ్య మాట్లాడుతూ మాలల హక్కుల సాధన కోసం అందరూ కలసి కట్టుగా ఏకతాటిపై నిలవాలన్నారు. కర్నూలులో జరిగే సభకు మాలలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.